RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి సంపుటి : 2 సంచిక : 134 శనివారం, జూన్ 29, 2024 పేజీలు : 4

## భద్రత పెంచాలని... హైకోర్టును ఆశ్రయించిన పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డి

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు మిథున్ రెడ్డి (రాజంపేట ఎంపీ) తమకు భద్రత పెంచాలంటూ ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ పై హైకోర్టు ఇవాళ విచారణ చేపట్టింది. నిబంధనల ప్రకారం పెద్దిరెడ్డికి 1 ప్లస్ 1 భద్రత కల్పిస్తున్నామని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలుపగా... ఎవరికి ఎంత భద్రత ఇవ్వాలనేది సెక్యూరిటీ రివిజన్ కమిటీ నిర్ణయిస్తుందని పిటిషనర్ల తరఫు న్యాయవాది పేర్కొన్నారు. వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం.. కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను జులై 8వ తేదీకి వాయిదా వేసింది.

### 4 రోజుల్లో రైతు రుణమాఫీపై...

## మార్గదర్శకాలు



హైదరాబాద్: రైతు రుణమాఫీపై నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పంట రుణాల మాఫీకి రేషన్ కార్డు ప్రమాణికం కాదని.. కుటుంబాన్ని గుర్తించడం కోసం మాత్రమేనని పేర్కొన్నారు. పాస్ బుక్ ఆధారంగానే రుణ మాఫీ ఉంటుందని తెలిపారు. రూ. 2లక్షల వరకు మాత్రమే రుణమాఫీ ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ఖజానాకు ఆర్థిక భారం ఉన్న సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రైతు రుణమాఫీ తర్వాత రైతు బంధు ఇతర పథకాలపై దృష్టి పెడతామని వెల్లడించారు. పంట రుణాలు మాత్రమే మాఫీ అవుతాయి తప్ప. బంగారంపై తీసుకున్న రుణాల మాఫీ కాదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ కొరత లేదని.. పంపిణీలో మాత్రమే అంతరాయాలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తాము అధికారంలోకి వచ్చేసరికి ప్రతి ఏడాది జరిగే నిర్వహణ పనులు జరగడం వల్లే అంతరాయం ఏర్పడిందని చెప్పారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండు రోజుల్లో తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ఉంటాయని తెలిపారు.

### సంస్కరణలతో దేశ ప్రగతిని పరుగులు పెట్టించిన

## పి.వి.నరసింహారావు



హైదరాబాద్: సంస్కరణలతో దేశ ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావుకు దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు జయంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో పి.వి. చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రంలో వివిధ శాఖల మంత్రిగా, ప్రధానమంత్రిగా పి.వి. చేసిన సేవలు మరువరానివని పేర్కొన్నారు. ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి రెడ్డి పి.వి. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## త్వరలోనే సిఎం రేవంత్ రెడ్డిని కలుస్తా:ఎంపి అర్వింద్

**నిజామాబాద్:** నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నిజాం షుగర్ ఫ్యాక్టరీ, జక్రాన్ పల్లి ఎయిర్ పోర్టు ఏర్పాటు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిపై త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి చర్చిస్తానని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కోసం కొడంగల్, మధిర అసెంబ్లీ నియోజవర్గాలను ప్రభుత్వం ఎంపిక చేయడాన్ని ఆయన విమర్శించారు.



శుక్రవారం ఢిల్లీలో అర్వింద్ మీడియాతో మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టుల విషయంలో మీ సొంత నియోజకవర్గాలను మీరు చూసుకుంటే మరి తెలంగాణను ఎవరు చూసుకోవాలని ప్రశ్నించారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటులో మీ విజన్ ఏమిటో తెలియాలంటే రాష్ట్ర జాగ్రఫికల్ గా పైలట్ ప్రాజెక్టులను ఎంచుకోవాలే తప్ప సొంత నియోజకవర్గాల్లో ఎంపిక చేస్తే దానిని ప్రజాపాలన అనరని విమర్శించారు.

## ఎమ్మెల్సీ కవితతో మాజీ మంత్రి హరీష్ రావు ములాఖత్

న్యూఢిల్లీ : తీహార్ జైలులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో ఆ పార్టీ నాయకులు, మాజీ మంత్రి హరీష్ రావు శుక్రవారం ఉదయం ములాఖాత్ అయ్యారు. ములాఖాత్ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండమని కవితకు సూచించారు. ఇటీవలే మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, కేటీఆర్ కవితతో ములాఖత్ అయిన విషయం విదితమే. ఢిల్లీ మద్యం విధానం కేసులో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని మరోసారి పొడిగించిన సంగతి తెలిసిందే. జూలై 5 వరకు ఆమె కస్టడీని పొడిగిస్తూ రౌస్ ఎవెన్యూ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అధికారులు జూన్ 21వ తేదీన



ఆమెను వర్చువల్‌గా కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ కేసును జూలై 3వ తేదీన రౌస్ ఎవెన్యూ కోర్టు మరోమారు విచారణ జరుపనున్నది. కాగా, కవిత బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

## ప్రజా భవన్‌లో ప్రజా వాణి

### - 494 దరఖాస్తుల స్వీకరణ



హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నారెడ్డి పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలు చిన్నారెడ్డిని, ప్రజాభవన్ అధికారులను కలిసి వినతిపత్రాలు అందచేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 494 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 125, హౌసింగ్ కు సంబంధించి 43 దరఖాస్తులు, పౌరసరఫరాల శాఖ కు సంబందించి 71, హెూం శాఖకు సంబందించి 45 దరఖాస్తులు, పంచాయతి రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కు సంబందించి 47, ఇతర శాఖలకు సంబంధించి 48 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య ఇతర అధికారులు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించండం తో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## బీఆర్ఎస్‌ను వీడి దొంగలతో కలిసేటోళ్ల గురించి బాధ లేదు : కేసీఆర్



హైదరాబాద్: పార్టీని వీడి దొంగలతో కలిసేటోళ్ల గురించి బాధలేదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. తెలంగాణ సాధించిన మనకు గిదో లెక్కనా? అని వ్యాఖ్యానించారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన నివాసంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలతో కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. పార్టీయే నాయకులను తయారు చేస్తుంది తప్ప.. నాయకులు పార్టీని ప్రభావితం చేయలేరని స్పష్టం చేశారు. నాడైనా నేడైనా నాయకులను తయారు చేసుకున్నది పార్టీనే అని తెలిపారు. మెరికల్లాంటి యువ నాయకులను పార్టీ సృష్టిస్తదని చెప్పారు. రెట్టించిన ఉత్సాహంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్ రెడ్డి, జాజాల సురేందర్, గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, ఎల్ రమణ తదితరులు పాల్గొన్నారు. గత 15 రోజులుగా కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో కొనసాగుతున్న ఆత్మీయ సమ్మేళనాలు శుక్రవారం కూడా కొనసాగాయి. కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల నుంచి వందలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. అంతకు ముందు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలతో కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్ రెడ్డి, జాజాల సురేందర్, గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, ఎల్ రమణ తదితరులు పాల్గొన్నారు. కాగా, బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో కొనసాగుతున్న కేసీఆర్ ఆత్మీయ సమావేశాలకు మూడు రోజులు బ్రేక్ ఇవ్వాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. కేసీఆర్‌తో పార్టీ ముఖ్యనేతలు చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆత్మీయ సమావేశాల పునఃప్రారంభ వివరాలను, ఏ నియోజకవర్గాల వారు ఎప్పుడు రావాలనే విషయాలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

### రాష్ట్రపతి ప్రసంగంపై తర్వాత...

## ముందు నీట్ పై చర్చించాలి

న్యూఢిల్లీ : నీట్ సమస్య దేశ యువతకు, వారి భవిష్యత్తుకు సంబంధించినది కనుక నీట్ పరీక్ష నిర్వహణలో అవకతవకల అంశంపై పార్లమెంట్‌లో 'హుందాయైన', మేలిమి చర్చ జరపాలని ప్రధాని నరేంద్ర మోడీకి లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం విజ్ఞప్తి చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సముదాయంలో విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానాన్ని చేపట్టడానికి ముందే నీట్ వివాదంపై చర్చ జరగాలని కోరారు. నీట్ వివాదం ప్రస్తుతం అత్యంత ప్రధాన అంశం అని, మరి ఏ అంశంపై కన్నా దీనినే చర్చకు చేపట్టాలని ప్రతిపక్షాలు అంగీకరించాయని కాంగ్రెస్ నేత తెలియజేశారు. 'యువజనులు కలవరపడుతున్నారు, ఏమి జరుగుతోందో వారికి తెలియదు. విద్యార్థుల ఆందోళనల ప్రస్తావనలో ప్రభుత్వం, ప్రతిపక్షం సమైకంగా ఉన్నాయని పార్లమెంట్ నుంచి యువతకు ఒక సందేశం, హామీ వెళ్లాలి' అని ఆయన అన్నారు.



### నీట్‌పై చర్చకు... : కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

## ప్రభుత్వం సిద్ధం



న్యూఢిల్లీ : నీట్ వైద్య ప్రవేశ పరీక్షపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే, సంప్రదాయాన్ని, సభ గౌరవాన్ని ముందు పాటించాలని, ఆ తరువాత అది జరుగుతుందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం స్పష్టం చేశారు. నీట్ యుజి నిర్వహణలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై చర్చ కోరుతూ ప్రతిపక్షాలు నిరసనలు వ్యక్తం చేసిన నేపథ్యంలో శుక్రవారం లోక్‌సభ వాయిదాపడిన తరువాత మంత్రి ప్రధాన్ విలేకరులతో మాట్లాడుతూ, విద్యార్థులను గందరగోళానికి గురి చేయవద్దని ఆ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. 'ప్రభుత్వం ఏ విధమైన చర్చకైనా సిద్ధమే. అయితే, నిబంధనలు, సభ గౌరవం పాటించిన తరువాత ప్రతిదీ జరుగుతుంది. రాష్ట్రపతి గురువారం తన ప్రసంగంలో ఆ పరీక్ష గురించి మాట్లాడారు. దేనినైనా ఎదుర్కొనడానికి మేము సిద్ధంగా ఉన్నామన్న ప్రభుత్వ ఉద్దేశాన్ని ఆ ప్రసంగం సూచించింది' అని పార్లమెంట్ వెలుపల విలేకరులతో మంత్రి చెప్పారు. దేశ యువత, విద్యార్థుల పట్ల ప్రభుత్వం బాధ్యతతో ఉన్నదని ఆయన తెలిపారు.

## 'నీట్' నుంచి మా రాష్ట్రాన్ని మినహాయించండి:డిఎంకె

చెన్నై: బిజెపి వాకౌట్ చేసినా.. దేశవ్యాప్తంగా నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్ లో అనేక రాష్ట్రాలలో అవకతవకలు చోటుచేసుకుంటున్నందున నేషనల్ మెడికల్ కమిషన్ యాక్ట్ ను సవరించాలని కేంద్రాన్ని కోరుతూ తమిళనాడు ప్రభుత్వం శుక్రవారం తీర్మానం చేసింది. నేషనల్ ఎల్జిబిలిటీ–కమ్–ఎంట్రెన్స్ టెస్ట్ నుంచి తమిళనాడు రాష్ట్రాన్ని మినహాయించాలని కోరింది. ప్లస్ టూ ఎగ్జామ్ మార్కుల ఆధారంగానే విద్యార్థులు మెడికల్ కోర్సుల్లో చేరే వీలుకల్పించాలంది. బిజెపి సభ్యులు వాకౌట్ చేసినా కూడా తమిళనాడు అసెంబ్లీ ఈ తీర్మానం చేసింది. కాగా బిజెపికి మిత్రపక్షంగా ఉన్న పాట్టాలి మక్కల్ కక్చి(పిఎంకె) మాత్రం ఈ తీర్మానానికి



మద్దతు ఇచ్చింది. కేంద్రం దేశవ్యాప్తంగా నిర్వహించే నీట్ పరీక్ష వివక్ష పూరితంగా ఉందని ముఖ్యమంత్రి, డిఎంకె పార్టీ అధినేత ఎం.కె.స్టాలిన్ అభిప్రాయపడ్డారు. దాని వల్ల గ్రామీణ ప్రాంతానికి చెందిన వారు, బీద విద్యార్థులు వైద్య విద్య ప్రవేశ పరీక్షకు అనర్హులవుతారన్నారు. అందుకనే ప్లస్ టూ పరీక్ష ఫలితాల ఆధారంగానే మెడికల్ కోర్సుల ప్రవేశం ఉండాలన్నారు. కాగా మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె. పళనిస్వామి డిఎంకె పార్టీ తీరును విమర్శించారు. 'నీట్' పరీక్షను బహిష్కరించకుండా ఇప్పుడేమిటీ నాటకం అని విమర్శించారు.

## సంపాదకీయం

### ఉక్రెయిన్ సంక్షోభ

# నేపథ్య ఫలితం.....!

రష్యా–ఉత్తర కొరియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకోవటం ప్రపంచ పరిణామాల్లో ఒక ముఖ్యమైన అంశం. ఇరవై నాలుగేండ్ల తరువాత రష్యా అధినేత వ్లదిమిర్ పుతిన్ ఉత్తర కొరియా సందర్శనలో సంతకాలు చేశారు.తమ కంట్లో నలుసుగా, పంటికింద రాయిగా, కాళ్లో ముల్లుగా ఉన్న దేశాలను అణగదొక్కేందుకు చూస్తున్న అమెరికా నాయకత్వంలోని పశ్చిమ దేశాలకు సహజంగానే ఇది మింగుడు పడక చిందులు వేస్తున్నది. ఉక్రెయిన్తో పదేండ్ల రక్షణ ఒప్పందాన్ని అమెరికా కుదుర్చుకున్నపుడు లేని రచ్చ ఇప్పుడెందుకు ? తన అణుకార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకుపోయేందుకు, పదును పెంచేందుకు ఈ ఒప్పందం గురించి అమెరికా తప్పుడు ప్రచారం ప్రారంభించింది. ఉత్తర కొరియా అందిస్తున్న ఆయుధాలకు ప్రతిగా దాని అణు కార్యక్రమానికి, ఖండాంతర క్షిపణుల వృద్ధి, అణు జలాంతర్గాముల నిర్మాణానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, యుద్ధ విమానాలు,సాయుధ శకటాలను అందించనుందని అంటున్నది. ఇదంతా పశ్చిమ దేశాలను మరింతగా భయపెట్టి తన కౌగిట్లో బంధించుకొనేందుకు, వాటితో పెద్ద మొత్తంలో ఆయుధాలను కొనిపించేందుకు అన్నది స్పష్టం.నాటో కూడా దానికి తానతందాన అన్నది. అసలు ఒప్పంద పత్రాన్ని ఇంతవరకు ప్రకటించలేదు, దానిలో ఉన్న అంశాలేమిటో తెలియకుండానే ఇలా చెప్పటంలో ఆశ్చర్యం లేదు. పశ్చిమ దేశాలు ఇస్తున్న ఆయుధాలను ఆత్మరక్షణకే గాక అవసరమైతే రష్యా భూభాగాలపై దాడులు చేసేందుకు కూడా జెలెన్స్కీ సేనలకు అనుమతి ఇచ్చిన అంశం తెలిసిందే. తెలివితేటలు పశ్చిమదేశాల గుత్త సొత్తేమీ కాదు. ఎవరి తురుపు ముక్కలు వారికి ఉంటాయి.కంటికి కన్ను పంటికి పన్ను మాదిరి ఉంటేనే అగ్రరాజ్యం ఒళ్లు దగ్గర పెట్టుకొని ఉంటుంది.రష్యాకు వ్యతిరేకంగా, అసలు సమస్య నుంచి ప్రపంచాన్ని తప్పుదారి పట్టించేందుకు స్విడ్జర్లాండ్లో నిర్వహించిన ఉక్రెయిన్ శాంతి సభ సాధించేందేమీ లేదు. అమెరికా కూటమికి చెంపపెట్టుగా దానికి హాజరైన అనేక ముఖ్యదేశాలు సమావేశ ప్రకటనపై సంతకాలు చేసేందుకు తిరస్కరించాయి. హాజరైన 90దేశాలలో భారత్, బ్రెజిల్, మెక్సికో, ఇండోనేషియా వంటి పన్నెండు దేశాలు వాటిలో ఉన్నాయి. సం తకం చేసిన ఇరాక్, జోర్డాన్ తరువాత ఉపసంహరించు కున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ సమావేశానికి రష్యాను పిలవలేదు, ఆహ్వానం అందుకున్న చైనా తిరస్కరించింది. రష్యా లేకుండా ఆ సభ సాధించేదేమీ ఉండదని చెప్పింది. కొలంబియా చివరి నిమిషంలో తాము హాజరు కావటం లేదని తెలిపింది. ఉక్రెయిన్ సంక్షోభ నేపథ్యంలోనే రష్యా–ఉత్తర కొరియా ఒప్పందం అన్నది స్పష్టం.ఉక్రెయిన్పై సైనిక చర్య జరుపుతున్న రష్యాకు ఉత్తర కొరియా అందిస్తున్న మందుగుండు, రాకెట్ల గురించి పశ్చిమదేశాలు గుర్రుగా ఉన్నాయి.రష్యాకు సరఫరా అవుతున్న 48లక్షల ఫిరంగి గుండ్లున్న కంటెయినర్లను తాము కనుగొన్నట్లు అమెరికా ఫిబ్రవరిలో చెప్పింది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత నాటి సోవియట్ యూనియన్, ఉత్తర కొరియా, చైనాలను బెదిరించేందుకు, అవసరమైనపుడు దాడులు చేసేందుకు వీలుగా అమెరికన్లు దక్షిణకొరియా, జపాన్లో సైనిక స్థావరాలను ఏర్పాటు చేయటమేగాక జపాన్తో రక్షణ ఒప్పందం కూడా చేసుకుంది. ఇప్పుడు ఉత్తర కొరియాతో రష్యా అదే చేసింది. దీని ప్రకారం మూడోపక్షం లేదా కూటమి ఎవరి మీద దాడి చేసినా ఉమ్మడిగా ఎదుర్కొనేందుకు అవకాశం కల్పిస్తుంది. బంగ్లాదేశ్ విముక్తికి మన దేశం మిలిటరీని పంపి సాయం చేసినపుడు మనల్ని బెదిరించేందుకు అమెరికా బంగాళాఖాతంలోకి సప్తమ నౌకా దళాన్ని దించింది. అప్పుడు నాటి సోవియట్ యూనియన్తో మనదేశం కూడా ఇలాంటి రక్షణ ఒప్పందమే చేసుకోవటంతో అమెరికా తోకముడిచింది. ఈ నేపథ్యంలోనే ఒప్పందం జరిగింది. రష్యా, ఉత్తర కొరియా మరింత దగ్గరయ్యాయి. రెండు దేశాల మీద సామ్రాజ్యవాద కూటమి అమలు జరుపుతున్న ఆంక్షలను ఎదుర్కొనేందుకు కూడా ఉపయోగ పడుతుంది. పశ్చిమ దేశాలతో సాగుతున్న వైరుధ్యాలు ఇప్పటికిప్పుడు సమిసేవికాదు. ఇప్పటికే చైనాతో ఎంతో దగ్గరైన రష్యా మరొక ముందడుగువేసి ఉత్తర కొరియాతో మైత్రిని పటిష్టం చేసుకోవటమే కాదు పశ్చిమ దేశాలతో పోరాడే సామర్థ్యాన్ని కూడా పెంచుకున్నట్లయింది. ఉత్తర కొరియా కూడా ఎవరిని చూసీ భయపడాల్సిన పరిస్థితి ఉండదు. ఒకవైపు రష్యా, మరొకవైపు చైనా రక్షణ కవచాల్లా ఉంటాయి. ఉక్రెయిన్తో పదేండ్ల రక్షణ ఒప్పందాన్ని అమెరికా కుదుర్చుకున్నపుడు లేని రచ్చ ఇప్పుడెందుకు ? తన అణుకార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకుపోయేందుకు, పదును పెంచేందుకు ఈ ఒప్పందం గురించి అమెరికా తప్పుడు ప్రచారం ప్రారంభించింది. ఉత్తర కొరియా అందిస్తున్న ఆయుధాలకు ప్రతిగా దాని అణు కార్యక్రమానికి, ఖండాంతర క్షిపణుల వృద్ధి, అణు జలాంతర్గాముల నిర్మాణానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, యుద్ధ విమానాలు,సాయుధ శకటాలను అందించనుందని అంటున్నది.

## పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలు సజావుగా సాగేందుకుగాను చర్యలు చేపట్టండి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం



**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పరీక్షలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సాఫీగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులకు సూచించారు. ఈ నెల 30 నుండి జూలై 04 వరకు కొనసాగనున్న డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ నియామక రాత పరీక్షను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎగ్జామ్ ఏర్పాట్లపై సమీక్ష జరుపుతూ, అధికారులకు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ నియామక రాత పరీక్షల్లో నిర్ణీత తేదీలలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 9:30 లోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. మధ్యాహ్నం 2: 00 లోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఆలస్యమైతే పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరగదు అన్నారు. పరీక్షలు సాఫీగా కొనసాగేలా సంబంధిత అధికారులతో పాటు చీఫ్ సూపెరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

పరీక్షా కేంద్రాలలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ చికిత్సకు ఏఎంఎంలను ఏర్పాటు చేయాలని, సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలని అన్నారు. బయోమెట్రిక్ విధానం అమలులో ఉన్నందున అభ్యర్థులు కనీసం రెండు గంటల ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. అధికారులు అందరు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో చేరేందుకు గాను దరఖాస్తులు ఆహ్వానం




**శామీర్ పేట, (గరుడ వార్త) :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల శామీర్ పేట (జగద్గిరిగుట్ట) డిగ్రీ కోర్సుల ఆసక్తి ఉండి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ బికాం బి ఎ, బి కాం సి ఎ, ఎంపీసీ, ఎమ్మెస్ సి ఎస్, ఎం జడ్ సి, బి జడ్ సి, ఎం ఎస్ డి ఎస్, బి ఎస్ సి హానార్స్ గ్రూపుల్లో విద్యార్థులకు అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇంటర్ పాస్ అయ్యి ఉన్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థినిలు నేరుగా కళాశాలకు వచ్చి మీకు నచ్చిన గ్రూపులో చేరవలసిందిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ తెలిపారు. అర్హులైన విద్యార్థినిలు ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలని కోరారు.

## ఇండియాకు ప్రభాకరరావు




**హైదరాబాద్, జూన్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ప్రభాకర్ రావు ఇండియాకు వస్తున్నట్టు కొన్ని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ నెల 26వ తేదీతో ప్రభాకర్ రావు వీసా గడువు ముగియనున్నట్టు ఆయన తరఫు న్యాయవాదులు కోర్టులో ఇది వరకే తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావును విచారించడానికి పోలీసులు చాలా రోజులుగా ఎదురుచూస్తున్నారు. ఒక వేళ ప్రభాకర్ రావు ఇండియాలో అడుగుపెడితే.. మరుక్షణమే పోలీసులు అరెస్టు చేసే అవకాశం ఉన్నది. ఆయనను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌లోకి తీసుకోవడానికి సిట్ అధికారులు సిద్ధంగా ఉన్నారు. అయితే, అనారోగ్యం కారణంగా వీసా గడువును ప్రభాకర్ రావు పెంచుకునే అవకాశాలూ లేకపోలేవు. ఇందుకోసం ఆయన ప్రయత్నిస్తున్నట్టూ తెలుస్తున్నది.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఫోన్ ట్యాపింగ్ కేసు కలకలం రేపింది. ఎస్ఐబీ పోలీసులు అసాంఘిక శక్తులపై నిఘా పెట్టడం కంటే కూడా వేరే వారిపై నిఘా పెట్టినట్టు ఆరోపణలు వచ్చాయి. అప్పటి ప్రభుత్వ పెద్దలు రాజకీయ ప్రత్యర్థులపై నిఘా కోసం, ఎన్నికల్లోనూ ప్రత్యర్థులకు అడ్డంకులు సృష్టించడానికి వీరిని ఉపయోగించినట్టు వార్తలు ఉన్నాయి. అంతేకాదు, వ్యాపారవేత్తలు, ప్రైవేటు వ్యక్తుల జీవితాల్లోకి కూడా ఫోన్ ట్యాపింగ్ చేసి పలువురు పోలీసు అధికారులు తొంగిచూసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఫోన్ ట్యాపింగ్ కేసు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.ఈ కేసులో ప్రధాన నిందితుడిగా మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు ఉన్నారు. అయితే, ఆయన అనారోగ్య కారణాల రీత్యా అమెరికాకు వెళ్లినట్టు తెలిసింది. మరికొంత కాలం అమెరికాలోనే చికిత్స తీసుకోవాల్సి ఉంటుందని, ఆ తర్వాత తెలంగాణకు తిరిగి వచ్చి దర్యాప్తునకు సహకరిస్తానని ఆయన సన్నిహితులకు చెప్పినట్టు వార్తలు వచ్చాయి. కానీ, ఆయన తిరిగి రాలేదు. ఈ నేపథ్యంలోనే ప్రభాకర్ రావును విదేశీ దర్యాప్తు సంస్థల సహాయంతో పట్టుకుని స్వదేశానికి తీసుకురావాలనీ పోలీసులు భావించారు. ఇందుకోసం రెడ్ కార్నర్ నోటీసులు కూడా జారీ చేశారు. ప్రభాకర్ రావుతోపాటు శ్రవణ్ కుమార్‌కు కూడా నోటీసులు జారీ చేశారు. కానీ, ప్రభాకర్ రావును విచారించే విషయంలో పురోగతి సాధించలేకపోయారు. కోర్టులో ఆయన తరఫు న్యాయవాదులు వెల్లడించిన వివరాల ప్రకారం ఈ రోజు ఆయన ఇండియాకు తిరిగి రావాలి. ఒక వేళ వీసా గడువు పెంచుకుంటే.. పోలీసులు ఏం నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పటికి సస్పెన్స్.ఇది వరకే ఈ కేసులో ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్ రావులను పోలీసులు విచారించారు. ఈ విచారణలో ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక విషయాలను పోలీసులు రాబట్టారు. అయితే, ఈ వ్యవహారంలో కీలక సూత్రధారిగా భావిస్తున్న ప్రభాకర్ రావు విచారణపై ఉత్కంఠ నెలకొంది

## సోషల్ మీడియా వేదికగా ఇండియా కూటమి


**హైదరాబాద్:** దేశంలో 18వ లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. వరుసగా మూడోసారి బీజేపీ నేతృత్వంలోని ఏన్డీఏ ప్రభుత్వం ఏర్పడింది. మోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే విపక్ష ఇండియా కూటమి అధికార ఎన్డీఏపై యుద్ధం మొదలు పెట్టింది. వాస్తవానికి ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ ఎంపీ సీట్లు తగ్గాయి, అదే సమయంలో కాంగ్రెస్ సీట్లు పెరిగాయి. ఇండియా కూటమి బలం పుంజుకుంది. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల నాటికి బీజేపీని బలహీన పర్చడమే లక్ష్యంగా ఇండియా కూటమి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది.బీజేపీకి బలంగా భావించే సోషల్ మీడియానే ఇప్పుడు ఇండియా కూటమి వేదికగా చేసుకుంది. సైలెంట్‌గా కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచారం మొదలు పెట్టింది. ఇటీవల ఐఆర్‌సీటీసీ కొత్త నిబంధనలు అంటూ విస్తృతంగా ప్రచారం చేసింది. వ్యక్తిగత ఖాతా ఉన్నవారు ఇతరులకు టికెట్ బుకింగ్ చేస్తే జైలుకు వెళ్తారని సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం చేశారు. అయితే దీనిపై రైల్వే శాఖ వివరణ ఇచ్చుకుంది. ఇందులో వాస్తవం లేదని, తప్పుడు వార్తలు నమ్మొద్దని సూచించింది. కానీ, అప్పటికే ప్రజల్లో కేంద్రంపై ఆగ్రహం వ్యక్తమైంది.ఇక సోషల్ మీడియా వేదికగానే జీఎస్టీపైనా ప్రచారం మొదలు పెట్టారు. గతంలో కూడా అనేక రకాల పన్నులు ఉండేవి. కానీ, కేంద్రం ఈ పన్నులన్నీ కలిసి జీఎస్టీ పేరుతో ఒకే గాటికి తెచ్చింది. దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం అమలు చేస్తోంది. కానీ, దీనిపై విపక్ష ఇండియా కూటమి ఇప్పుడు కేంద్రం భారీగా పన్నులు విధిస్తోందని ప్రచారం మొదలు పెట్టింది. గతంలో వేర్వేరు పన్నులు కట్టినా అవి మనకు తెలిసేవి కావు. కానీ బీజేపీ జీఎస్టీ విధానంతో పౌరులు ఎంత పన్ను చెల్లిస్తున్నార్న విషయం తెలిసేలా చేసింది. దీనినే ఇపుపడు విపక్ష కూటమి తమకు అనుకూలంగా మార్చుకుంటోంది. కేంద్రం జీఎస్టీ రూపంలో భారీగా పన్నులు వసూలు చేస్తోందని ప్రచారం చేస్తున్నాయి. తద్వారా కేంద్రంపై విషం చిమ్మే ప్రయత్నం జరుగుతోంది.ఇక కేంద్రం వసూలు చేస్తున్న టోల్ ట్యాక్స్‌పైనా విపక్షాలు ప్రచార జోరు పెంచాయి. ఎన్నికలు ముగిసిన వెంటనే జూన్ 1 అర్ధరాత్రి నుంచి టోల్ చార్జీలు 5 శాతం పెరిగాయి. దీంతో ఇప్పుడు దీనిని కూడా విపక్ష కూటమి తనకు అనుకూలంగా, కేంద్రంపై వ్యతిరేకంగా ప్రచారం చేసుకుంటున్నాయి. అటల్‌బిహారి వాజ్‌పేయి అమలు చేసిన స్వర్ణ చతుర్భుజి పథకంంలో భాగంగా ప్రధాని మోదీ రోడ్ల విస్తరణకు అనేక చర్యలు చేపట్టారు. మోదీ ప్రధాని అయ్యాక వేల కిలోమీటర్ల రోడ్లు విస్తరణకు నోచుకున్నాయి. గతంలో ఉన్న గతుకుల రోడ్లు కనిపించడం లేదు. దూర భారం చాలా వరకు తగ్గింది. రెండు మూడు గంటల్లోనే వందల కిలోమీటర్లు ప్రయాణించ గలుగుతన్నారు. సౌకర్యాలు మెరుగుపర్చిన నేపథ్యంలో రహదారుల నిర్వహణకు అయ్యే చార్జీలను కూడా కేంద్రం వాహనదారుల నుంచే వసూలు చేస్తుంది. అందుకే రోడ్లు అందరికీ సౌకర్యంగా ఉంటన్నాయి. పెరుగుతున్న రేట్లకు అనుగుణంగా టోల్ చార్జీలను కూడా కేంద్రం సవరిస్తోంది. దీనిని కూడా విపక్షం తమకు అనుకూలంగా ప్రచారం చేసుకుంటోంది.ఇలా అనేక కార్యక్రమాలపై కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని విపక్ష పార్టీలు సోషల్ మీడియా వేదికగా మెల్లిగా జనంలోకి చొప్పిస్తున్నాయి. ఉన్నఫలంగా ప్రభుత్వానికి ఏమీ కాకపోయినా.. రాబోయే రోజుల్లో ఇవి బీజేపీకి నష్టం కలిగిస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## బిల్ట్ ఫ్యాక్టరీని మళ్లీ తెరిపిస్తాం: మంత్రి సీతక్క



మంగపేట: ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలో గత పదేండ్ల క్రితం మూతపడిన బిల్ట్ కంపెనీకి త్వరలోనే మంచి రోజులు రానున్నాయని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మూత పడిన బిల్ట్ ఫ్యాక్టరీని మంత్రి సీతక్క ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రా, జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజ తదితరులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక పక్షపాతి అని అన్నారు. బిల్ట్ ఫ్యాక్టరీలోని పాత యంత్రాలు, పాత సామాను తొలగింపు, సంబంధిత విషయాలను ఫిన్ క్వెస్ట్ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. పాత మిషనరీ తొలగింపు విషయంలో జాప్యం చేయకుండా చూడాలని ఫిన్ క్వెస్ట్ సంస్థ, రాధా స్టీల్ సంస్థ ప్రతినిధులకు సూచించారు. వీలున్నంత త్వరలో బిల్ట్ ఫ్యాక్టరీని రీ ఓపెనింగ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా, నియోజకవర్గ, బ్లాక్, మండల, గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## ఢిల్లీ విమానాశ్రయంలో కూలిన పైకప్పు: ఒకరు మృతి



ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వరసగా రెండో రోజు వర్షం బీభత్సం సృష్టించింది. ఢిల్లీలోని విమానాశ్రయం టెర్మినల్–లో పైకప్పు కూలిపోవడంతో ఒకరు మృతి చెందగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పైకప్పు కూలిన ఘటనలో పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు, విమానాయన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. టెర్మినల్ 1 నుంచి విమాన సర్వీసులు రద్దు చేశారు. ముందుజాగ్రత్తగా విమానాశ్రయ వర్గాలు చెక్ ఇన్ కౌంటర్లను మూసివేశారు. ఢిల్లీ విమానాశ్రయం టెర్మినల్–1లో ఊడిపడిన ప్రాంతాన్ని కేంద్రమంత్రి రామ్మోహన్ రాయుడు పరిశీలించారు. ఉదయం 5 గంటలకు టెర్మినల్–1లో పైకప్పు ఊడిపడిందని రామ్మోహన్ రాయుడు తెలిపారు. గాయపడిన నలుగురిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని, ఘటన స్థలిలో సిఐఎస్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

# అభివృద్ధి రేటులో భారత పట్టణాలు....



ఆధునిక డిజిటల్ ఏఐ యుగంలోఆకరషణీయ ఉద్యోగ ఉపాధులను వెతుక్కుంటూ గ్రామీణ యువత పట్టణాలకు చేరడం వేగంగా జరుగుతోంది. పల్లె యువత ఆర్థికంగా లాభం లేని వ్యవసాయ ఆధార వృత్తులను వదిలి ఎర్ర బస్సెక్కి నగరాలకు చేరడం, ఏదో ఒక పనిని చూసుకొని బతుకు పోరు సాగించడం చూస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా పట్టణీకరణ క్రమంగా, వేగంగా పెరగడంతో అంతే వడిగా సమస్యలు కూడా నగరవాసులకు నరకం చూపిస్తున్నాయని ఇటీవల ఆక్స్‌ఫర్డ్ ఎకనమిక్స్ విభాగం విడుదల చేసిన "ప్రపంచ పట్టణాల సూచిక లేదా గ్లోబల్ సిటీస్ ఇండెక్స్" అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దాదాపు 1,000 ప్రపంచ నగరాల 'గ్లోబల్ సిటీస్ ఇండెక్స్' అధ్యయనాలకు మూలాలుగా నగరాల ఆర్థిక ప్రగతి, మానవ వనరులు, పర్యావరణం, జీవన నాణ్యత, ప్రభుత్వ పరిపాలనలకు సంబంధించిన 27 ఇండికేటర్స్‌ను తీసుకున్నారు. 2019 - 35 మధ్య కాలంలో ప్రపంచ నగరాలన్నింటిలో అత్యంత వేగంగా పెరుగుతున్న భారత్‌కు చెందిన 10 నగరాలు ముందు వరుసలో ఉండడం ప్రధాన అంశంగా పేర్కొంటున్నారు. ప్రతి ఏట వేగంగా పెరుగుతున్న 20 ప్రపంచ నగరాల జాబితాలో భారత్‌కు చెందిన 17 నగరాలు ముందు వరుసలో ఉండడం గమనార్హం. అత్యంత వేగంగా 9.17 శాతం జిడిపీ పెరుగుదల చూపిన గుజరాత్‌లోని వస్త్ర పరిశ్రమలతో పాటు వజ్రాల వాణిజ్య పట్టణమైన సూరత్ ప్రపంచ నగరాల జాబితాలో ప్రథమ స్థానం దక్కించుకుంది. దీనితో పాటు తొలి 10 స్థానాల్లో భారతీయ నగరాలు చేరాయని నివేదిక స్పష్టం చేస్తున్నది. ఈ జాబితాలో సూరత్ (జిడిపీ వృద్ధి రేటు 9.17 శాతం), ఆగ్రా (8.58 శాతం), బెంగుళూరు (8.5 శాతం), హైదరాబాదు (8.47 శాతం), నాగపూర్ (8.41 శాతం), తిరుపూర్ (8.36 శాతం), రాజ్‌కోట్ (8.33 శాతం) తిరుచిరాపల్లి (8.29 శాతం), చెన్నై (8.17 శాతం), విజయవాడ (8.16 శాతం) లాంటి 10 నగరాలు తొలి 10 స్థానాలను దక్కించుకున్నాయి. ఐటీ, అంకుల్ సంస్థల హబ్‌గానే కాకుండా 'సిటీ ఆఫ్ పెరల్స్'గా హైదరాబాదుకు గుర్తింపు ఉన్నది. నాగపూర్‌లో దాదాపు 22,000 ఎంఎస్ఎంఈలు పనినచేస్తున్నాయి. నిట్‌వేర్ ఇండస్ట్రీ హబ్‌గా తిరుప్పూర్, మాన్యుఫాక్చరింగ్, ఆటోమొబైల్ హబ్‌గా రాజ్‌కోట్, ఇండస్ట్రియల్ సిటీగా తిరుచురాపల్లి, ఆటోమొబైల్, ఫిలిం, ఐటీ హబ్‌గానే కాకుండా 'డెట్రాయిట్ ఆఫ్ ఇండియా'గా చెన్నై, పలు రకాలైన వాణిజ్య కార్యకలాపాలకు కేంద్రంగా విజయవాడ నగరాలకు గుర్తింపు ఉన్నది. అత్యధిక ఆర్థిక వ్య వస్థ (లార్జెస్ట్ అర్బన్ ఎకానమీ) కలిగిన ప్రపంచ నగరాల జాబితాలో న్యూయార్క్ ప్రథమ స్థానాన్ని నిలుపుకుంటూ వస్తున్నది. అత్యధిక ఆర్థిక వ్యవస్థ కలిగిన నగరాల్లో భారత నగరాలు వెనుకబడి ఉన్నట్లు స్పష్టం అవుతున్నది. ప్రపంచ పట్టణాల సగటు ఆర్థిక వృద్ధి 2.6 శాతంగా నిర్ధారించబడింది. అత్యధిక ఆర్థిక వ్యవస్థ కలిగిన 10 ప్రపంచ పట్టణాల్లో న్యూయార్క్(యూఎస్), లండన్(యూకె), సాన్ జోస్ (యూఎస్), టోక్యో(జపాన్), పారిస్(ఫ్రాన్స్), సీటిల్ (యూఎస్), లాస్ ఎంజెలిస్ (యూఎస్), సాన్ ఫ్రాన్సిస్కో (యూఎస్), మెల్బర్న్(ఆస్ట్రేలియా), జూరిచ్(స్విస్) ముందు స్థానాలను దక్కించుకున్నాయి. ప్రపంచవ్యాప్త ప్రధాన 1,000 నగరాల ద్వారా 60 శాతం జిడిపీ వయద్ధి నమోదు అవుతున్నట్లు తెలుస్తున్నది. ఈ జాబితాలో యూఎస్‌కు చెందిన 5 పట్టణాలు ఉండడం విశేషం. హ్యూమన్ క్యాపిటల్ (మానవ వనరులు) విభాగంలో లండన్ (యూకె), టోక్యో(జపాన్), రియాద్?(సౌధీ), న్యూయార్క్ (యూఎస్), సియోల్(దక్షిణ కొరియా) నగరాలు తొలి ఐదు స్థానాలను దక్కించుతున్నాయి. జీవన నాణ్యత లేదా క్వాలిటీ ఆఫ్ లైఫ్ విభాగంలో గ్రెనోబుల్ (ఫ్రాన్స్), కాన్‌బెరా (ఆస్ట్రేలియా), బెర్న్(స్విస్), బెర్జెన్(నార్వే), బేసెల్(స్విస్) పట్టణాలు తొలి ఐదు స్థానాలను ఆక్రమించాయి. పరిశుద్ధ పర్యావరణం కలిగిన ప్రపంచ నగరాల జాబితాలో సువా(ఫిజి), ఫోర్టలెజా(బ్రెజిల్), సాన్ జువా(పెర్టో రికో),నాటల్(బ్రెజిల్), వెల్లింగ్టన్(న్యూజీలాండ్) పట్టణాలు ఉన్నాయి. పారదర్శక, నిష్పాక్షిక ప్రభుత్వ పరిపాలన విభాగంలో న్యూజీలాండ్, డెన్మార్క్, ఫిన్‌లాండ్, నార్వే, స్వీడెన్ దేశాలు తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయి. భారత పట్టణాల్లో నేడు పర్యావరణ కాలుష్యం, జీవన నాణ్యత కొరవడడం, ప్రభుత్వ పాలన అవినీతి కోరల్లో చిక్కడం, మౌళిక వనరుల కొరత, అస్తవ్యస్త ప్రజారవాణ, రోడ్ల దుస్థితి, పలుచనైన హరిత వనాలు, ప్రణాళికా రహిత పట్టణీకరణ లాంటి పలు ప్రధాన సమస్యలు పట్టి పీడిస్తున్నాయని తెలుసుకొని ప్రభుత్వాలు, పట్టణ పౌర సమాజం తమ తమ విధులను సక్రమంగా నిర్వహించాలని కోరుకుందాం

## క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేత



**తాడేపల్లిగూడెం:** క్రీడలు ద్వారా తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద పసుమర్తి చందు సహకారంతో పలువురు క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేశారు. ఎంతోమంది క్రీడల ద్వారా ఉన్నత స్థితికి చేరారు అన్నారు. చదువుతోపాటు క్రీడలు జీవితానికి అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతుల అన్నవరం, ఉప సర్పంచ్ అత్తింటి సోమశేఖర రావు, ఎంపీటీసీలు కరుటూరి గోవిందరాజు, పసుమర్తి సత్యనారాయణ, వార్డు సభ్యులు, యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

===============================

## మహిళ హత్యకేసులో ఇద్దరు అరెస్టు

**పల్నాడు:** మహిళను హత్య చేసిన ఘటనలో నిందితులను 24 గంటల్లో పల్నాడు జిల్లా కారంపూడి పోలీస్ లు అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన పోలీసులను పల్నాడు జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కారంపూడి సర్కిల్ సీఐ కి రివార్డ్ పత్రం అందజేశారు. అలానే కారంపూడి ఎస్సై అమీర్ భాషకు రివార్డ్ పత్రం అందజేశారు. కానిస్టేబుల్ పోతరాజుకు కూడా ఎస్పీ రివార్డ్ పత్రం అందజేశారు .మహిళను హత్య చేసిన ఘటనలో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ మల్లికా గార్గే మాట్లాడుతూ అర్ధరాత్రి కారంపూడి మండలం ఒప్పిచర్లలో విజయలక్ష్మి దారుణ హత్యకుగురైంది. రమావత్ బాబునాయక్, బాణావత్ బాలూనాయక్ ఇద్దరూ మద్యం కోసం దుకాణం దగ్గరకు వెళ్లారు. మద్యం అమ్ముతున్న విజయలక్ష్మితో ఘర్షణకు దిగారు. విజయలక్ష్మిపై కక్ష పెంచుకుని ఆమె ఇంటికి వచ్చి అఘాయిత్యానికి పాల్పడి హత్య చేశారు.

===============================

## చిక్కిన చిరుత

**కర్నూలు:** ఉమ్మడి కర్నూలు జిల్లా మహానంది పరిధిలోని పచ్చర్ల గ్రామస్తులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న చిరుత ఎట్టకేలకు అటవీశాఖ ఉచ్చులో చిక్కింది. పచ్చర్ల అటవీ ప్రాంతంలో గత వారం రోజులుగా సాధారణ ప్రజలపై దాడికి దిగుతున్న చిరుత ఇక్కడి ప్రజలను ఆందోళనకు గురిచేసింది. ముఖ్యంగా మూడు రోజుల క్రితం పచ్చర్ల గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ మెహరున్నీసా అనే మహిళ వంట చెరుకు కోసం అడవిలోకి వెళ్లగా ఆమెపై దాడి చేసి చంపేసింది. ఆమెతో పాటు మరో ఇద్దరిపైనా కూడా దాడి చేసింది. చిరుత వరుస దాడులతో బెంబేలెత్తిన గ్రామస్తులు గిద్దలూరు చిరుతను బంధించాలని హైవే రోడ్డును దిగ్భంధించి నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలో హై అలర్ట్ అయిన అధికారులు నల్లమల పచ్చర్ల చెక్ పోస్ట్ వద్ద బోను ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు అటవీ అధికారుల ఉచ్చుకు చిరుత బోనులో చిక్కింది. మేకను ఎరగా వేసి బోనులో బంధించారు. చిరుత పట్టుబడటంతో గ్రామస్థులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, బోనులో చిక్కిన చిరుత, మెహరూన్ పై దాడి చేసిన చిరుత ఒక్కటేనా లేదంటే ఇంకో చిరుతనా అన్న అనుమానం అటవీశాఖ అధికారులకు కలుగుతోంది. ప్రస్తుతం పట్టుబడిన చిరుత వయస్సు 5 నుండి 6 సంవత్సరాలు ఉంటుందని అటవీ అధికారులు వెల్లడించారు. పచ్చర్ల వద్ద బోనులో చిక్కిన చిరుతను తిరుపతి జూపార్క్ కు తరలించనున్నట్లు అటవీ శాఖ అధికారులు వెల్లడించారు.

========================

## బీఆర్ఎస్‌లో కార్యకర్తలే సైనికులు: కెసిఆర్..

**హైదరాబాద్:** బీఆర్ఎస్‌లో కార్యకర్తలే సైనికులు. . ఒక్కొక్కరు ఒక్కో బుల్లెట్. కాంగ్రెస్ మోసాన్ని ప్రజలు గ్రహిస్తరు అని బీఆర్ఎస్ అధినేత,మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. అప్పటిదాక ఓపిక పడుదాం. తెలంగాణ తెచ్చిన ఖ్యాతి కంటే ముఖ్యమంత్రి పదవి పెద్దదేం కాదు. కాంగ్రెస్ మోసాన్ని ఎండగట్టేది. ప్రజాచైతన్యమే, బీఆర్ఎస్‌కు ఆదరణ ఎన్నటికీ తగ్గదు. ప్రజాదరణే బీఆర్ఎస్‌కు అసలైన బలం. రోజురోజుకు దిగజారుతున్న కాంగ్రెస్. పాలన అని అన్నారు. బాల్కొండ, హుజూరాబాద్, ఆర్మూర్ నియోజకవర్గాల క్యాడర్‌తో సమావేశం అయ్యారు. లంగాణ సాధన అనే మహోన్నత లక్ష్యాన్ని సాధించిన, అంతటి ఉదాత్తమైన లక్ష్యం కోసం ఎన్నో పదవులను త్యాగం చేసిన చరిత్ర మనది. తెలంగాణ సాధించిన ఘనత కన్నా నాకు సీఎం పదవి అనేది పెద్ద విషయం కాదు. బీఆర్ఎస్ పార్టీకి బుల్లెట్ల వంటి కార్యకర్తలు ఉన్నారని, వారినే నాయకులుగా తీర్చిదిద్దుకుందామని పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

========================

## 100 టన్నుల చేపలు మృతి

**హైదరాబాద్:** పటాన్ చెరు మండలం చిట్కుల్ గ్రామంలోని పెద్ద చెరువులో సుమారు 10 టన్నుల చేపలు మృతి చెందాయి. చేపల మృతికి రసాయన వ్యర్థ పదార్థాలే కారణమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమీపంలోని పలు ఫ్యాక్టరీల నుండి వెలువడే రసాయన వ్యర్థ పదార్థాలు చెరువులో కలవడంతోనే చేపలు మృతి చెందినట్లు ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం మేరకు మత్స్యశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. చెరువు నీటి శాంపిల్స్ సేకరించి టెస్టులకు పంపించారు. చెరువు నిండా కుప్పలు, తెప్పలుగా చచ్చిపోయి తేలిన చేపల్ని చూసి మత్స్యకారులు లబోదిబోమంటున్నారు. చేపల మృతితో సుమారు కోటి రూపాయలకు పైగా నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేశారు. 2023లో గత నైరుతి రుతుపవనాల సమయంలో మత్స్యశాఖ సరస్సులో 1.5 లక్షల చేప పిల్లలను విడుదల చేసింది. మత్స్యకారుల ఫిర్యాదు మేరకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, మత్స్యశాఖ అధికారులు సరస్సును సందర్శించారు. ప్రాథమిక పరీక్ష తర్వాత, పిసిబి అధికారులు కరిగిన ఆక్సిజన్ స్థాయిలు సాధారణం కంటే తక్కువగా ఉన్నాయని, ఇది చేపల మరణానికి దారితీసిందని గుర్తించారు.. అయితే ల్యాబ్ రిపోర్టులు వచ్చిన తర్వాతే కచ్చితమైన కారణాన్ని వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

# ఆకలి కేకలను ఆపగలమా...!



ప్రపంచంలో పోషకాహార లోపం వున్న వారు అత్యధికంగా ఆసియా దేశాల్లో 41.8 కోట్ల మంది ఉండగా, ఆఫ్రికాలో 28.2 కోట్ల మంది ఉన్నారు. కరోనా మహమ్మారి విజృంభణతో అదనంగా 3 కోట్ల మంది పేదలు ఆకలితో అలమటించారు. ప్రత్యేక చర్యలు అమలు పరచని పక్షంలో 2030 నాటికి 66 కోట్ల మంది పేదలు ఉంటారని, ఆకలిని అంతం చేయడం అసాధ్యమని తెలుస్తున్నది. ఐక్యరాజ్యసమితి ప్రధాన శాఖలైన ప్రపంచ ఆహార సంస్థ (యఫ్ఏఓ), యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ (ఐయఫ్ఏడి), వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ (డబ్ల్యూయఫ్‌పి)లు సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనాల ఆధారంగా నివేదికను విడుదల చేశారు. అన్నార్తులకు సంబంధించి పైన పేర్కొన్న అంశాలు ఈ నివేదిక వెలువరించినవే. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో (యస్‌డిజి) భాగంగా 2030 నాటికి ప్రపంచంలో ఆకలి చావులు, పోషకాహార లోపం లేకుండా చూస్తూ, 'జీరో హంగర్ (ఆకలి లేని లోకం)' సాధించాలనే ఉన్నత నిర్ణయం తీసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా 237 కోట్లకు పైగా (ప్రతి ముగ్గురిలో ఒకరు) ప్రజలకు అవసరమైనంత ఆహారం లభించడం లేదని నివేదిక తెలుపుతున్నది. లింగ వివక్ష కారణంగా పురుషుల కన్న మహిళల్లో 10 శాతం అధికంగా ఆహార అభద్రతతో బాధపడుతున్నారు. ఆహార ధాన్యాల అధిక ధరలు, ఆదాయం తగ్గడం వల్ల 300 కోట్ల మంది పేదలు పోషకాహారానికి దూరం అవుతున్నారు. పోషకాహార లోపం ప్రపంచ మానవాళికి శాపంగా వెంటాడుతున్నది. ప్రపంచవ్యాప్తంగా 22 శాతం (150 కోట్లు) ఐదేళ్ల లోపు పిల్లలు శరీర వృద్ధి నిలిచిపోవడం (స్టంటింగ్)తో, 6.7 శాతం (4.54 కోట్లు) అభివృద్ధి తగ్గడం (వేస్టింగ్)తో, 5.7 శాతం (3.89 కోట్లు) అధిక బరువు (ఓవర్ వేయిట్) సమస్యలతో బాధ పడుతున్నారు. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో పిల్లల పోషకాహారలోపం అత్యధికంగా కనిపిస్తున్నది. ఆసియా, ఆఫ్రికా ప్రాంతాల్లో 15-49 ఏళ్ల మహిళల్లో 30 శాతం రక్తహీనత (ఎనీమియా) సమస్య కనిపించగా, అమెరికా, యురొప్‌లో 14.6 శాతం మాత్రమే నమోదు అయ్యింది. గర్భిణిలలో రక్తహీనత, పిల్లల్లో ఎదుగుదల మందగించడం, తల్లి పాల లభ్యత పడిపోవడం, తక్కువ బరువుతో శిశు జననాలు, అధిక బరువు పిల్లలు పెరగడం, వయోజనుల్లో స్థూలకాయం లాంటి సమస్యల మధ్య 2030 నాటికి ఆకలిని అంతం చేయడం అసాధ్యమని వివరించారు. ఆహార అభద్రత, పోషకాహార లోపం పెరగడానికి కారణాలుగా వాతావరణ అసాధారణ మార్పులు, ఆర్థిక మందగమనం, ఆర్థిక అసమానతలు, లాక్‌డౌన్/ కర్ఫ్యూలు లాంటి అంశాలను నివేదిక పేర్కొంది. ఆహార ధాన్యాల దిగుబడి, ఆదాయాలు తగ్గడం, మార్కెటింగ్ లొసుగుల (ఉత్పత్తి, పంట కోత, ప్రాసెసింగ్, రవాణా, మార్కెటింగ్, ధరలు)తో పేదలు పోషకాహారానికి దూరం అవుతున్నారు. పోషకాహార లభ్యత పెరగడానికి%ొ% వాతావరణ ఒడుదుడుకులను తట్టుకోగల ఆహార వ్యవస్థలు, ఆర్థిక కష్టాలను అధిగమించడం, ఆహార సరఫరాలో నాణ్యతను పరిరక్షించడం, పేదరికంతో పాటు అసమానతలను తొలగించడం, పోషకాహారం పట్ల ఆరోగ్య అవగాహన కల్పించడం లాంటి అంశాలను పేర్కొంది. ఆర్థిక అసమానతలు పెరిగితే ప్రకృతి సహజ వనరులైన సారవంతమైన నేలలు, మత్స్య సంపద, అటవీ సంపద, నీటి వనరుల కోసం ఘర్షణలు జరగడం సర్వసాధారణం. సమాజంలో ఆదాయం, ఉత్పత్తి సామర్థ్యం, ఆస్తులు, టెక్నాలజీ, విద్య, ఆరోగ్య రంగాల్లో అసమానతలు పెరిగితే వాటి దుష్ప్రభావం అధికంగా మహిళలు, పిల్లలపై నేరుగా పడుతుంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి నుంచి వినియోగం వరకు ఇమిడి ఉన్న పలు దశల్లో ఆహారం వ్యర్థం కావడం నేర సమానమని నమ్మాలి. ఆహారాన్ని ఆదా చేస్తే ఆహారం ఉత్పత్తి చేసిన దాని కన్న మిన్న అని తెలుసుకోవాలి. 'యు.యన్ ఫుడ్ సిస్టమ్స్ సమిట్' సూచనల ప్రకారం ప్రపంచ దేశాలు తమదైన చర్యలను తీసుకుంటూ 2030 నాటికి 'జీరో హంగర్' దిశగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలైన ఆహార అభద్రత (యస్‌డిజి టార్గెట్-2.1), పోషకాహార లోపాలను (యస్‌డిజి టార్గెట్-2.2) అధిగమించి, అనుకున్న సదుద్దేశ్యాలను సగర్వంగా చేరుకోవాలని ఆశిద్దాం. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో (యస్‌డిజి) భాగంగా 2030 నాటికి ప్రపంచంలో ఆకలి చావులు, పోషకాహార లోపం లేకుండా చూస్తూ, 'జీరో హంగర్ (ఆకలి లేని లోకం)' సాధించాలనే ఉన్నత నిర్ణయం తీసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా 237 కోట్లకు పైగా (ప్రతి ముగ్గురిలో ఒకరు) ప్రజలకు అవసరమైనంత ఆహారం లభించడం లేదని నివేదిక తెలుపుతున్నది. లింగ వివక్ష కారణంగా పురుషుల కన్న మహిళల్లో 10 శాతం అధికంగా ఆహార అభద్రతతో బాధపడుతున్నారు. ఆహార ధాన్యాల అధిక ధరలు, ఆదాయం తగ్గడం వల్ల 300 కోట్ల మంది పేదలు పోషకాహారానికి దూరం అవుతున్నారు.

## ధర్మపురితో పాములపర్తి అనుబంధం...!



పాములపర్తి వెంకట నరసింహా రావుకు ధర్మపురి క్షేత్రంతో అవినాభావ సంబంధం ఉంది. బ్రాహ్మణ అగ్రహారమైన ధర్మపురి వాసులతో బంధుత్వం లేకున్నా, ఇక్కడి శ్రీ నృసింహా గురు పీఠంతో, అలాగే సమకాలీన రాజకీయాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉన్న నాయకులతో గల సన్నిహిత సంబంధాల దృష్ట్యా తరుచుగా పి.వి. క్షేత్రానికి వస్తూ పోతూ ఉండేవారు. అష్టాదశ పురాణములను ఔపోసనం పట్టి, నిత్య పురాణ ప్రవచనాలతో భక్తులను ఆధ్యాత్మిక లోకాలలో విహరింప చేసిన, అపర వేదవ్యాసులుగా పేరుగాంచిన గుండి రాజర్షి వద్దకు వచ్చి, శ్రద్ధగా విని, సందేహ నివృత్తి చేసుకున్న నేపథ్యం, అపర ధన్వంతరి, నాటక సంస్థ స్థాపకులు, దర్శకులు, బహుముఖ ప్రజ్ఞాశాలి కాసర్ల వేంకట రాజయ్య, కొరిడే కిష్టయ్య, వొజ్జల కోటయ్య, పాత కాంతయ్య, పెండ్యాల లక్ష్మీ నరహరి తది తరులతో, కొరిడే కిష్టయ్య ఇంటి అరుగుపై రోజుల కొద్దీ రాజకీయ చర్చలు చేసిన విషయాలు క్షేత్ర పాతతరం వారికి నిత్య జ్ఞాపకాలుగా ఉన్నాయి. 1967లో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిగా, లక్ష్మీ నరసింహా స్వామి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్న పి.వి. తర్వాత సీఎం బ్రహ్మానంద రెడ్డి, ఆర్థిక మంత్రి మర్రి చెన్నారెడ్డి లతో చర్చించి, స్థానికులు, స్వాతంత్ర్య సమరయోధుడు కే.వీ. కేశవులకు ఏక సభ్య దేవస్థాన పునరుద్ధరణ కమిటీ బాధ్యులుగా నియమింప చేసి, దేవాలయాల అభివృద్ధికి, శ్రీ వెంకటేశ్వర విగ్రహ ప్రతిష్టాపన అది కార్యక్రమాలకు పి.వి. చేయూత అందించారు. ధర్మపురి క్షేత్రంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం సహకారంతో నిర్వహించ బడిన శ్రీ రాజ రాజేశ్వర వెంకటేశ్వర సంస్కృత పాఠశాల కోసం శాశ్వత భవనం నిర్మించాలని, నాటి దేవస్థాన పాలక వర్గ కమిటీకి సూచించి, 1970 అక్టోబర్ 2న రాష్ట్ర విద్యా శాఖ మంత్రిగా, శంకు స్థాపన చేశారు. తర్వాత సదరు పాఠశాల భవనం 1976 ఆగస్టు 11న నాటి రాష్ట్ర వ్యవసాయ, రవాణా శాఖల మంత్రి జువ్వాడి చొక్కారావు, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి రాజా సాగి సూర్య నారాయణ రాజు చేతుల మీదుగా ప్రారంభం చేసుకోవడం జరిగింది. 1971 శాసనసభ సార్వత్రిక ఎన్నికల సమయంలో సీఎం హెరీదాలో నాటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బి. రాములుకు మద్దతుగా ధర్మపురి లో ప్రచార సభలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా గోదావరి నుండి త్రాగు నీటి సరఫరా పథకం మంజూరీ ఇచ్చి, మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతి రావును నీటి సరఫరా పథకం పనులు చేయాలని కోరారు. తమ సన్నిహితులు రొట్టె విశ్వనాథ శాస్త్రి కోరికపై, స్థానిక లక్ష్మీ నరసింహ సంస్కృతాంధ్ర డిగ్రీ ప్రాచ్య కళాశాల శాశ్వత భవన నిర్మాణం చేపట్టాలని నాటి కరీంనగర్ కలెక్టర్ కే. ఎస్. శర్మను ఆదేశించారు. స్థానిక కాంట్రాక్టర్ సంగి కిష్టయ్య నిర్మాణం గావించారు. క్షేత్రంలో గోదావరి రక్షిత మంచినీటి సరఫరా పథకం, తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మశాల, సంస్కృత పాఠశాల భవనం, ఓరియంటల్ డిగ్రీ కళాశాల భవనం పి.వి. చొరవ వల్లనే సాధ్య మైనాయని పి.వి. సన్నిహితులు, ప్రభుత్వ సన్మానితులు, నరసింహ పీఠ నిర్వాహక బాధ్యులు బ్రహ్మశ్రీ రొట్టె విశ్వనాథ శాస్త్రి చెపుతుండేవారు.

# ఎన్‌కౌంటర్: ముగ్గురు ఉగ్రవాదులు మృతి





శ్రీనగర్: జమ్ముకాశ్మీర్‌లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు మృతి చెందారు. దోడా జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. దోడా జిల్లాలోని ఒక అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు దాక్కొనిఉన్నారనే సమాచారంతో భద్రతా సిబ్బంది ఇక్కడ తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుందని అధికారులు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఈ ఉగ్రవాదులే ఇటీవల భారత సైన్యంపై కాల్పులు జరిపి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలం నుంచి భారీ స్థాయిలో మందుగుండు సామగ్రి, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులు ఇటీవల వరుస దాడులకు పాల్పడుతున్నారు. దీంతో దోడా, రాజౌరీ, పూంచ్ ప్రాంతాల్లో తనిఖీలు, ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ నెల 11న భద్రతా దళాలపైఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఐదుగురు సైనికులతో పాటు ఓ పోలీసు అధికారి తీవ్ర గాయాలపాలయ్యారు. మరో ఘటనలో పోలీస్ క్యాంపుపైనా దాడులు చేశారు. మరోవైపు భారత వాయుసేన కీలక స్థావరం ఉన్న పఠాన్ కోట్ జిల్లాలోనూ భారీ ఆయుధాలతో ఇద్దరు ఉగ్రవాదులు సంచరిస్తున్నట్లు భద్రతా దళాలు గుర్తించాయి. దీంతో అక్కడా హైఅలర్ట్ ప్రకటించారు.

## ఎంఎస్‌పికి చట్టబద్ధత ఎప్పుడు..?


మూడవ సారి నరేంద్ర మోడీ ప్రధాని పదవి చేపట్టారు. ఎంతో వేగంగా పని చేస్తారనే ప్రచారం పెద్ద ఎత్తున చేశారు. దానికి పక్కా నిదర్శనం జమ్ము కాశ్మీరుకు రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 370ని ఎంత వేగంగా రద్దు చేశారో దేశం చూసింది. 2019 జులై చివరి వారంలో అసాధారణ రీతిలో కాశ్మీరులో భద్రతా దళాలను మోహరించారు. ఆగస్టు రెండవ తేదీ శుక్రవారం నాడు అమరనాథ్ యాత్రీకులకు ముప్పు ఉందంటూ యాత్ర నిలిపివేయాలని భద్రతా హెచ్చరిక కాశ్మీరు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఆదివారం నాడు రాష్ట్రమంతటా 144 సెక్షన్ ప్రకటించారు. ఇంటర్నెట్ నిలిపివేశారు. దానికి ముందు అదే రోజు రాష్ట్రపతి ఉత్తరువు వెలువడింది. వెంటనే మంత్రివర్గ సమావేశం, అనంతరం అదే రోజు దాని మీద రాజ్యసభలో బిల్లును ప్రవేశ పెట్టారు. సభ్యులకు దాని కాపీలు ఇవ్వలేదు. ఉదయం పదకొండు గంటలకు సభ సమావేశమైతే గంటన్నరలో అంటే 12.30 లోగా 57 పేజీల పత్రం మీద కావాలంటే సవరణలు ప్రవేశ పెట్టవచ్చని చెప్పారు. వాటిని చదివేందుకు కూడా ఆ సమయం చాలదు. అదే రోజు సభలో ఆమోదం కూడా పొందారు. మరుసటి ఏడాది కరోనాను అవకాశంగా తీసుకొని మూడు సాగు చట్టాలనూ అంతే వేగంగా ఆమోదించి అమలు చేసేందుకు పూనుకున్నారు. వేగంగా పని చేసే నాయకత్వ ఘనత గురించి నరేంద్ర మోడీ భక్తులు, గోడీ మీడియా పండితులను అడిగితే కొండవీటి చాంతాడంత జాబితాను మన ముందుంచుతారు. రైతుల మహత్తర ఉద్యమం కారణంగా స్వాతంత్ర్యానంతరం దేశంలో తొలిసారిగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలను క్షమాపణ చెప్పి మరీ 2021లో వెనక్కు తీసుకోవటం కూడా వేగంగా జరిగినట్లే ! ఈ వేగం కోట్లాది మంది కోట్లాది మంది రైతులు కోరుతున్న, గతంలో నరేంద్రమోడీ కూడా డిమాండ్ చేసిన కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించేందుకు ఎందుకు లేదు? రెండు సంవత్సరాల క్రితం ఎంఎస్‌పితో సహా రైతాంగ సమస్యలపై నియమించిన కమిటీ నుంచి ఇంతవరకు తాత్కాలిక నివేదికను కూడా ఎందుకు తెప్పించుకోలేదు? ఇష్టం లేని పెళ్లికి తలంబ్రాలు పోసినట్లుగా ప్రభుత్వ తీరు ఉంది. మూడు సాగు చట్టాలను 2021 నవంబరులో రద్దు చేసినపుడు వెంటనే ఒక కమిటీని వేస్తామన్నారు. వెంటనే అంటే ఎనిమిది నెలలు, 2022 జులై 12న కమిటీని వేశారు. ఆలస్యం ఎందుకంటే కొన్ని రాష్ట్రాలలో ఎన్నికల కారణంగా ఎన్నికల సంఘం అనుమతి ఇవ్వలేదని, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నుంచి స్పందన కోసం ఎదురు చూడాల్సి రావటం అని వ్యవసాయ మంత్రి సాకులు చెప్పారు. ఆ కమిటీకి నివేదించిన అంశాలు, కమిటీలో ప్రతిపాదించిన వ్యక్తుల పట్ల అభ్యంతరాలు తెలుపుతూ మోర్చా తన ప్రతినిధులను పంపేందుకు తిరస్కరించింది. కేంద్ర ప్రభుత్వం-ఎన్నికల కమిషన్ మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను అందించాలని సమాచార హక్కు కింద కోరగా అలాంటి రికార్డులు లేవని సమాధానం ఇవ్వటాన్ని బట్టి అసలు బండారం వెల్లడైంది. అంతేకాక రైతు సంఘాలతో సంప్రదింపుల సమాచారం కూడా లేదని 2023 డిసెంబరు నాలుగవ తేదీన మరో సమాచార హక్కు ప్రశ్నకు సమాధానం వచ్చింది. ఇక ప్రభుత్వం నియమించిన కమిటీ తీరుతెన్నులను చూస్తే ఎస్‌కెఎం ఎందుకు బహిష్కరించిందో వివరణ అవసరం లేదు. మొత్తం 29 మంది సభ్యులలో ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ సంస్థలు, కాలేజీల్లో పనిచేసే వారే 18 మంది ఉన్నారు. మిగిలిన పదకొండు మంది అధికారేతర సభ్యులలో ఎస్‌కెఎం నుంచి ముగ్గురిని నియమిస్తామని ప్రభుత్వం ప్రతిపాదించింది. మరో ఎనిమిది మంది అధికార పార్టీ కనుసన్నలలో వ్యవహరించే రైతు ప్రతినిధులే ఉన్నారు. ఈ కమిటీకి అధ్యక్షుడు సంజరు అగర్వాల్. వివాదాస్పద మూడు సాగు చట్టాలను ప్రతిపాదించినపుడు వ్యవసాయ శాఖ కార్యదర్శి. మరో సభ్యుడు ఇఫ్‌కో చైర్మన్ దిలీప్, ఇతగాడు గుజరాత్ బిజెపి మాజీ ఎంపీ. మరొకరు ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ బికెఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడైన ప్రమోద్ చౌదరి, ఐదవ సభ్యుడు సయ్యద్ పాషా పటేల్ మహారాష్ట్ర బిజెపి మాజీ ఎంఎల్‌సి, ఇలా అందరూ గత సాగు చట్టాలను అడ్డంగా సమర్థించిన వారితోనే నింపిన తరువాత ఎస్‌కెఎం గళానికి అవకాశం ఎక్కడ ఉంటుంది. ఇక ఈ కమిటీ తొలి పద్దెనిమిది నెలల కాలంలో 35 సమావేశాలు జరిపినట్లు, ఎప్పుడు నివేదిక సమర్పిస్తుందో చెప్పకుండా పార్లమెంటుకు ప్రభుత్వం జవాబిచ్చింది. ఫిబ్రవరి తరువాత మరో రెండు సార్లు సమావేశమైనట్లు వార్తలు. ఈ కమిటీ అనేక ఉపసంఘాలను ఏర్పాటు చేసింది. వాటి నివేదికలు ఇవ్వాలని కోరినా అందుబాటులో లేవన్నదే ప్రభుత్వ సమాధానం. గతంలో స్వామినాథన్ కమిషన్, తరువాత నరేంద్ర మోడీ ఏర్పాటు చేసిన 2016 కమిటీ కూడా అనేక అంశాలను చర్చించింది. అందువలన కొత్త కమిటీ చర్చల పేరుతో కాలయాపన తప్ప మరొకటి కాదు. వాటి సిఫార్సులకు వ్యతిరేకంగా మూడు సాగు చట్టాల్లోని అంశాలు ఉన్నాయి. అయినా మోడీ వాటిని రద్దు చేస్తూ 2021లో చేసిన ప్రసంగంలో రైతులకు కొత్త ఆశలను రేకెత్తించారు. 2014 ఎన్నికల సమయంలో బిజెపి చేసిన వాగ్దానానికి వ్యతిరేకంగా మోడీ సర్కార్ సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. దేశ 75వ స్వాతంత్ర్య దినోత్సవం (2022) నాటికి రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని 2016 ఫిబ్రవరి 28 బడ్జెట్ సందర్భంగా మోడీ చెప్పారు. అదే ఏడాది ఏర్పాటు చేసిన అశోక్ దలవాయి కమిటీ 2012-13 ఎన్‌ఎస్‌ఎస్‌ఓ అంచనా ప్రాతిపదికన 2015-2016లో ఒక రైతు రాబడి ఏడాదికి రూ.96,703, నెలకు రూ.8,058 ఉంటుందని అంచనా వేసి 2022-23 నాటికి అది రూ.2,71,378-రూ.22,610 ఉండాలని, దాన్ని సాధించాలంటే ఏటా 10.4 శాతం పెరుగుదల ఉండాలని చెప్పింది. ఇప్పుడు ఎంత ఉందో ఎక్కడా ప్రభుత్వం ప్రకటించలేదు. అయితే 2018-19లో 77వ రైతు కుటుంబాల పరిస్థితి అంచనా సర్వే ప్రకారం రాబడుల మొత్తాలు రూ.1,22,616-రూ.10,218 ఉన్నట్లు తేలింది.

## నాటో కొత్త సెక్రటరీ జనరల్‌గా నెదర్లాండ్స్ ఆపద్ధర్మ ప్రధాని



రష్యా-ఉక్రెయిన్ మధ్య తీవ్ర యుద్ధం జరుగుతున్న వేళ నాటో కూటమి సెక్రటరీ జనరల్‌గా నెదర్లాండ్స్ ఆపద్ధర్మ ప్రధాని మార్క్ రుట్టెను బుధవారం ఎన్నుకున్నారు. ఈ పదవి కోసం పోటీపడ్డ రుమేనియా అధ్యక్షుడు క్లాస్ యెహానిస్ ఇటీవల పోటీ నుంచి తప్పుకోవడంతో రుట్టె నియామకం లాంఛనప్రాయం కాగా, తాజాగా నాటో మిత్రపక్షాలు ఆయనను తదుపరి బాస్‌గా ఎన్నుకున్నాయి. 1 అక్టోబర్ 2024 నుండి రుట్టె సెక్రటరీ జనరల్‌గా తన విధులను స్వీకరిస్తారని నాటో ఒక ప్రకటనలో తెలిపింది. గత ఏడాది ఈ పదవిపై ఆసక్తి కనబరిచిన ఆయన, యునైటెడ్ స్టేట్స్, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీతో సహా కూటమిలోని ముఖ్య సభ్యుల నుండి ముందస్తు మద్దతు పొందారు. నాటోలో తూర్పు ఐరోపా దేశాలు ఈ పదవిని మొదటిసారిగా తమ ప్రాంతం నుండి ఎవరికైనా ఇవ్వాలని వాదించాయి, అయినప్పటికి మార్క్ రుట్టెను ఎన్నుకున్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై తీవ్ర విమర్శలు చేయడంతో పాటు, ఉక్రెయిన్‌కు గట్టి మిత్రుడిగా ఆయనకు పేరుంది. ప్రస్తుతం ఈ కూటమికి బాస్‌గా ఉన్న జెన్స్ స్టోల్టెన్‌బర్గ్ తన వారసుడిగా రుట్టే ఎంపికను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నట్లు చెప్పారు. మార్క్ నిజమైన అట్లాంటిసిస్ట్, బలమైన నాయకుడు, ఏకాభిప్రాయ-బిల్డర్, నేను నాటోను సమర్థ నాయకత్వం గల వారి చేతుల్లో వదిలివేస్తున్నానని ఆయన అన్నారు. ఇదిలా ఉంటే నాటో బాస్‌గా రుట్టె పలు సవాళ్లను ఎదుర్కొవాల్సి ఉంది. ముఖ్యంగా రష్యా దండయాత్రకు వ్యతిరేకంగా ఉక్రెయిన్ చేస్తున్న పోరాటానికి మిత్రదేశాల మద్దతు కూడగట్టడంలో ఆయనకు సవాళ్లు ఉన్నాయి.

## భారత్‌తో సంబంధాలకు పాక్ ఆసక్తి.. ఉప ప్రధాని ఇషాక్ దార్ కీలక వ్యాఖ్యలు




భారత్-పాక్ సంబంధాలపై పాకిస్థాన్ ఉప ప్రధాని ఇషాక్ దార్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో నిర్మాణాత్మకమైన సంబంధానికి పాక్ ఎల్లప్పుడూ సుముఖంగానే ఉంటుందని తెలిపారు. దక్షిణాసియాలో స్థిరత్వాన్ని కొనసాగించేందుకు అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ సభలో ఆయన మాట్లాడారు. బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం కొత్త పదవీకాలాన్ని ప్రారంభించినందున భారత్‌తో సంబంధాలు ఎంతో మెరగవ్వాల్సిన అవసరం ఉందన్నారు. భారత్‌తో సంబంధం చారిత్రాత్మకంగా సమస్యాత్మకంగానే ఉందని, అయితే పాకిస్తాన్ శాశ్వత శత్రుత్వాన్ని కోరుకోబోదని తెలిపారు. 2019 ఆగస్టు 5న జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను రద్దు చేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయం ద్వైపాక్షిక సంబంధాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందన్నారు. ఇరు దేశాల మధ్య నెలకొన్న అన్ని సమస్యలపై సంభాషణలకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత భారత్‌పై ఉందన్నారు. దార్ వ్యాఖ్యలపై భారత్ స్పందించలేదు. అయితే జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసినప్పటి నుండి, ఇది అంతర్గత విషయమని భారతదేశం వాదిస్తోంది.

## 'కేంద్రీకృత' పరీక్షలు సరికావు...!




**న్యూఢిల్లీ :** దేశంలో వైద్య కోర్సుల ప్రవేశ పరీక్ష (నీట్) ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నది. పేపర్ లీక్‌లు, పరీక్ష వాయిదాలతో యూజీ, పీజీలలో అడ్మిషన్లు కోరే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మోడీ సర్కారుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అలాగే, 'వన్ నేషన్, వన్ ఎగ్జామ్'గా తీసుకొచ్చిన ఈ నీట్ ఒక విఫల ప్రయోగమని మేధావులు, విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ) చీఫ్‌ను తొలగించటం, కమిటీని ఏర్పాటు చేయటం వంటివి కొంత వరకు జరిగినా విలువైన విద్యార్థుల సమయాన్ని మోడీ ప్రభుత్వం వృథా చేసిందని మేధావులు అంటున్నారు. 'నీట్' విషయంలో మోడీ సర్కారు వైఫల్యం స్పష్టంగా కనబడుతన్నదని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. అయితే, మోడీ ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చేలా కార్పొరేట్ మీడియా తన వంతు కృషి చేస్తున్నదని పలువురు నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయం నుంచి విద్య వరకు.. కేంద్రీకృతం చేయటానికి మోడీ సర్కారు భావిస్తున్నదనీ, భారత్ వంటి అతిపెద్ద విశాల దేశంలో ఈ విధానం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని నిపుణులు చెప్తున్నారు. నీట్-యూజీ, జేఇఇ, యూజీసీ-నెట్, సీయూఈటీ వంటి వాటితో సహా 15 ప్రధాన పరీక్షలు దేశంలో నిర్వహించబడుతున్నాయి. ఆచరణాత్మకంగా దేశవ్యాప్తంగా ఈ పరీక్షలను నిర్వహించటానికి సంబంధించిన పనులన్నీ అవుట్‌సోర్సింగ్ ద్వారా నిర్వహించబడతాయి. వారి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ప్రయివేటు సర్వీస్ ప్రొవైడర్లు తమ సిబ్బందితో పరీక్షలను నిర్వహించటం, ఐటీ సిస్టమ్‌లు, క్యూఆర్ కోడ్-సంబంధిత పని వంటి అన్ని సాంకేతిక పనులు ఔట్‌సోర్సింగ్ ద్వారానే జరుగుతుంది. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక పరీక్షలైన వీటికి ఔట్‌సోర్సింగ్ సహాయం తీసుకుంటే లీక్‌కు దారులు తెరిచినట్టేనని మేధావులు అంటున్నారు. ఈ పరీక్షల బాధ్యతను ఎన్‌టిఎ చేపట్టక ముందు సీబీఎస్‌ఈ, ఏఐసీటీఈ వంటి ప్రభుత్వ సంస్థలు ఈ పరీక్షలను నిర్వహించేవి. స్టేట్ సెలక్షన్ బోర్డ్‌ల వంటి వివిధ రాష్ట్ర స్థాయి పరీక్షల నిర్వహణలో, అలాగే రైల్వేలు, బ్యాంకుల వంటి రంగాల కోసం రిక్రూట్‌మెంట్‌లో కూడా ఔట్‌సోర్సింగ్ జరిగిందని విశ్లేషకులు చెప్తున్నారు. నీట్ వంటి ప్రతిష్టాత్మక పరీక్షల్లో ఇప్పుడు కనిపిస్తున్న లోపాలు రాష్ట్రాలలో పదేపదే బయటపడ్డాయి. ఈ సంవత్సరం ప్రారంభంలో ప్రచురించబడిన ఒక ఆంగ్ల వార్త సంస్థ సమాచారం ప్రకారం.. గత ఐదేండ్లలో 15 రాష్ట్రాల్లో కనీసం 48 పేపర్ లీక్ కేసులు కనుగొనబడ్డాయి. ఈ లీక్‌లు సుమారు 1.2 లక్షల పోస్టులకు కనీసం 1.4 కోట్ల మంది దరఖాస్తుదారుల జీవితాలను ప్రభావితం చేశాయి.

## ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే ఎయిర్ పోర్టులో ప్రయాణికుల పడిగాపులు



ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే లండన్ లోని హీత్రూ ఎయిర్ పోర్టులో ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు. బ్రిటీష్ ఎయిర్ వేస్ ఐటీ విభాగంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో, అధిక సంఖ్యలో విమాన సర్వీసులపై ప్రతికూల ప్రభావం పడింది. వేల మంది ప్రయాణికులు ఎయిర్ పోర్టులో పడిగాపులు కాస్తున్నారు. లగేజీ కలెక్షన్‌లో కూడా తీవ్ర జాప్యం జరుగుతోందని డెయిలీ మెయిల్ కథనంలో పేర్కొంది. కాగా.. విమాన సర్వీసులు ఎప్పుడు మొదలవుతాయో తెలియని పరిస్థితి. ఇప్పటికే చాలా మంది కనెక్టడ్ ఫ్లైట్లను మిస్సయ్యారు. బ్యాగేజింగ్ హాల్స్ లో దాదాపు 30 విమానాల ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఈ ఘటనపై బ్రిటీష్ ఎయిర్ వేస్ క్షమాపణలు కోరింది. టెక్నికల్ టీం సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని ప్రకటించింది. తమ ప్రయాణికులకు ఏర్పడ్డ అంతరాయంపై క్షమాపణలు కోరింది. వీలైనంత త్వరగా పరిస్థితిని సాధారణస్థితికి తీసుకొచ్చేందుకు యత్నిస్తామంది. ఎయిర్‌లైన్స్ అధికారిక కమ్యూనికేషన్స్‌తో ప్రయాణికులు టచ్‌లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ సమస్యకు కారణమైన బ్రిటిష్ ఎయిర్‌వేస్ దుర్యాప్తును ఎదుర్కోవడంతోపాటు.. పరిహారాలు కూడా చెల్లించాల్సి రావచ్చు.

## దిగొచ్చిన కెన్యా సర్కారు....!



పన్నుల పెంపు ప్రతిపాదనకు వ్యతిరేకంగా కెన్యా ప్రజలు భగ్గుమన్నారు. మంగళ, బుధవారాల్లో జరిగిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. కెన్యాలోని 47 కౌంటీలకుగానూ 35 చోట్ల నిరసనలు వెల్లువెత్తాయి.వీటిలో పాల్గొన్న దాదాపు 23 మంది ఆందోళనకారులు ప్రాణాలు కోల్పోయారు. బుల్లెట్ గాయాలతో 30 మంది ఆస్పత్రుల్లో చికిత్సపొందుతున్నారు. మరో 200 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రజల ఆగ్రహ జ్వాలను చూసి కెనడా ప్రభుత్వం దిగి వచ్చింది. పన్నుల పెంపు బిల్లును ఉపసంహరించుకుంటున్నట్లు కెన్యా అధ్యక్షుడు విలియం రూటో ప్రకటించారు. ప్రజల మనసెరిగి నడుచుకునే క్రమంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రజలతో చర్చించాకే ఈ బిల్లుపై తదుపరి నిర్ణయం తీసుకుంటామని తేల్చి చెప్పారు. నిరసనలతో కెన్యా అట్టడుకుతున్న వేళ ఆ దేశంలో ఉంటున్న భారతీయులకు భారత సర్కారు అడ్వైజరీ జారీ చేసింది. భారతీయులు జాగ్రత్తగా ఉండాలని కెన్యాలోని భారత కాన్సులేట్ సూచించింది. పరిస్థితి సద్దుమణిగేవరకు అనవసర రాకపోకలు చేయొద్దని కోరింది. నిరసనలు హింసాత్మకంగా ఉన్న ప్రాంతాలకు వెళ్లొద్దని కోరింది. అక్కడున్న భారత పౌరులు స్థానిక వార్తలు, ఇండియన్ మిషన్ వెబ్‌సైట్, సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో అప్‌డేట్స్ ఫాలో కావాలని చెప్పింది.

# కొబ్బరినీళ్లు తాగడం వల్ల ఈ సమస్యలు దూరం....



ఏదైనా సరైన సమయంలో తీసుకుంటే ఆరోగ్య ప్రయోజనాలు పెరుగుతాయి. కొబ్బరి నీరు తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని భావిస్తారు. కొబ్బరి నీళ్లలో యాంటీ ఆక్సిడెంట్లు, అమైనో ఆమ్లాలు, ఎంజైములు, విటమిన్ సి మొదలైన అనేక ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. రోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొబ్బరినీళ్లు తాగడం వల్ల శరీరానికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. కొబ్బరి నీరు తాగడానికి ఉత్తమ సమయం ఉదయం. కొబ్బరి నీళ్లు తాగడం వల్ల శరీరాన్ని డీహైడ్రేషన్ నుంచి కాపాడుతుంది. కొబ్బరి నీళ్లు తాగడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకుందాం. మీకు జీర్ణ సమస్యలు ఉంటే, మీరు ఉదయాన్నే కొబ్బరి నీటిని తాగవచ్చు. ఇందులోని గుణాలు జీర్ణక్రియను చక్కగా నిర్వహించడంలో సహాయపడతాయి. మీకు తలనొప్పి ఉంటే, మీరు కొబ్బరి నీటిని తాగవచ్చు. ఇది మీ నొప్పి నుండి ఉపశమనం పొందవచ్చు. కొబ్బరి నీరు తీసుకోవడం కండరాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడుతుంది. కొబ్బరి నీళ్లు తాగడం వల్ల శరీరానికి కావాల్సిన అన్ని అంశాలు అందుతాయి. అలాగే, దీన్ని తాగడం వల్ల పొట్ట ఎక్కువసేపు నిండుగా ఉంటుంది. తద్వారా అతిగా తినడం, బరువు తగ్గడం జరుగుతుంది. కొబ్బరి నీళ్లలో యాంటీ ఆక్సిడెంట్లు, అమైనో ఆమ్లాలు, ఎంజైములు, విటమిన్ సి మొదలైన అనేక ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. రోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొబ్బరినీళ్లు తాగడం వల్ల శరీరానికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. కొబ్బరి నీరు తాగడానికి ఉత్తమ సమయం ఉదయం. కొబ్బరి నీళ్లు తాగడం వల్ల శరీరాన్ని డీహైడ్రేషన్ నుంచి కాపాడుతుంది.

## ఆరోగ్యంగా ఉండాలంటే ఇలా పడుకోవాలి



ఆరోగ్యంగా ఉండాలంటే ప్రస్తుతం చాలా సవాళ్లను ఎదుర్కోవాల్సిందే. ఎన్నో ప్రయత్నాలు చేస్తేనే మీరు ఆరోగ్యంగా ఉండగలరు. తిన్నామా, పడుకున్నామా, తెల్లారిందా అన్నమాదిరి రోజులు ఉండటం లేదు. ఆరోగ్యం కోసం వ్యాయామాలు, కసరత్తులు, మంచి ఆహారం ఇలా చెప్పుకుంటే పోతే చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. ఇక మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. నిద్ర కూడా చాలా అవసరం. కానీ ఈ నిద్రించే సమయంలో ఏ వైపు పడుకుంటున్నారా? ఎలా పడుకుంటున్నారు అనేది కూడా ముఖ్యమే. రాత్రి సమయంలో తిన్న తర్వాత కాసేపు కచ్చితంగా నడవాలి. కానీ కొందరు వెంటనే బెడ్ ఎక్కుతారు. మధ్యాహ్నం కూడా తిని పడుకుంటారు. ఇలా చేయడం చాలా తప్పు. తెలిసో తెలియకో మీ శరీరాన్ని మీరు అనారోగ్య పాలు చేసిన వారు అవుతారు. అయితే పడుకునే ముందు ఒక అరగంట సేపు అయినా వెల్లకిల అంటే నిటారుగా పడుకోవాలి. ఒక అరగంట ఇలా పడుకోవడం వల్ల తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం అవ్వడానికి సహాయం అవుతుంది. ఇక అరగంట తర్వాత ఎడమ వైపుకు తిరిగి పడుకోవాలి. మీరు ఇలా పడుకున్నప్పుడు నిద్ర పోయినా అనుకోకుండా కొన్ని సార్లు కుడి వైపు తిరుగుతారు. దీని వల్ల ఎలాంటి సమస్య ఉండదు. కానీ ముందు మాత్రం స్టేట్ గా పడుకొని ఆ తర్వాత ఎడమ వైపుకు తిరిగి పడుకోవాల్సిందే అంటున్నారు నిపుణులు. మీరు ఎడమ వైపు తిరిగి పడుకోవడం వల్ల అన్నం జటరాగ్ని దగ్గరకు వెళుందట. దీని వల్ల ఆహారం తేలిగ్గా జీర్ణం అవుతుంది. అన్నం సరిగ్గా జీర్ణం అవకముందే పడుకోవడం అనారోగ్య సమస్యలు వస్తాయి. అందుకే అరగంట వెల్లకిలా ఆ తర్వాత ఎడమ వైపు తర్వాత కుడివైపు పడుకోవాలి. ఇలా చేయడం వల్ల ఎలాంటి సమస్యలు రాకుండా ఆరోగ్యంగా ఉంటారు.

## కోల్డ్ కాఫీతో ప్రమాదమా?



వేడి నుంచి ఉపశమనం పొందడానికి చాలా మంది చల్లని కాఫీని ఎక్కువగా తాగడానికి ఇష్టపడతారు. వేడి కాఫీ, టీలకు బదులు చల్లని కాఫీని గొప్ప రుచితో తాగుతారు. కానీ అతిగా తాగడం వల్ల శరీరంపై దుష్ప్రభావాలు కలుగుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ రోజుల్లో దేశంలో వేడిగా ఉంది. ఈ సమయంలో టీ, కాఫీకి బదులుగా కోల్డ్ కాఫీని తాగడానికి ఇష్టపడతారు. అయితే ఇది అనేక వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. అతిగా కోల్డ్ కాఫీ తాగడం శరీరానికి ఎలాంటి హాని చేస్తుంది..? ఆరోగ్య నిపుణులు ఏమనుకుంటున్నారో వివరంగా ఇప్పుడు కొన్ని విషయాలు తెలుసుకుందాం. కోల్డ్ కాఫీలో ఎక్కువగా చక్కెర ఉపయోగించబడుతుంది. అందువల్ల దీన్ని ఎక్కువగా తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి. అంతేకాకుండా టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదం కూడా పెరుగుతుంది. కోల్డ్ కాఫీలో అధిక మొత్తంలో కెఫిన్ కూడా ఉంటుంది. దీనిని అధికంగా తాగడం వల్ల నిద్ర చక్రంలో ఆటంకం ఏర్పడే అవకాశాలు పెరుగుతాయి. అదనంగా నిద్ర లేకపోవడం అనేక వ్యాధుల ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. ఎక్కువగా కోల్డ్ కాఫీ తాగితే డీహైడ్రేషన్ బారిన పడే అవకాశం ఉంటుంది. కాబట్టి తాగే ముందు కడుపుకు మంచిదని అస్సలు అనుకోవద్దని నిపుణులు ఉంటున్నారు. కోల్డ్ కాఫీ తాగడం వల్ల భయానికి, ఆందోళనకు కూడా గురవుతారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇది కడుపుకు అస్సలు మంచిది కాదని చెబుతున్నారు.

## ప్రతిరోజూ కూల్ డ్రింక్స్ తాగుతున్నారా...?



వేసవి కాలంలో శీతల పానీయాలకు భారీగా డిమాండ్ ఉంటుంది.. దీంతోపాటు సాధారణ సమయాల్లోనూ కూల్ డ్రింక్స్ ను బాగానే తాగుతుంటారు.. అయితే.. శీతల పానీయాలు, ప్యాక్ చేసిన జ్యూస్‌లు లేదా ఫ్లేవర్డ్ మిల్క్‌లు.. లాంటివి ఎక్కువగా వేసవికాలంలో తాగుతారు.. ఈ పానీయాలు హీట్‌స్ట్రోక్ నుంచి ఉపశమనం కలిగిస్తాయని విశ్వసిస్తారు.. అయితే.. వాటివల్ల ఎలాంటి లాభం ఉండదని.. పైగా ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.. జస్ట్ రిఫ్రెష్ కోసం తాగడం తప్పితే.. ఎలాంటి ప్రయోజనం ఉండదంటున్నారు.. అయితే కొందరు కూల్ డ్రింక్స్ ను రోజూ తాగుతుంటారు.. అలాంటివారి ఆరోగ్యానికి తీవ్రమైన హాని కలుగుతుందని.. ముమ్ముందు చాలా దుష్ప్రభావాలను ఎదుర్కోవలసి ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రోజూ శీతల పానీయాలు తాగడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. శీతల పానీయాలు తాగడం వల్ల వచ్చే నాలుగు ప్రధాన సమస్యల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. ఊబకాయం - మధుమేహం ప్రమాదం: సాధారణంగా శీతల పానీయాలలో పెద్ద మొత్తంలో చక్కెర, కృత్రిమ చక్కెరను ఉపయోగిస్తారు. వీటిని రోజూ తీసుకోవడం వల్ల శరీరంలో చక్కెర స్థాయి పెరుగుతుంది. ఇది ఊబకాయం, టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని పెంచుతుంది. గుండె జబ్బులు వచ్చే ప్రమాదం: శీతల పానీయాలలో అధిక ఫ్రక్టోజ్ కార్న్ సిరప్ అనే పదార్థం ఉంటుంది. ఇది శరీరంలో ట్రైగ్లిజరైడ్స్ స్థాయిని పెంచుతుంది. ట్రైగ్లిజరైడ్స్ ఒక రకమైన కొవ్వు, వీటిలో అధిక స్థాయి కొలెస్ట్రాల్ సిరల్లో పేరుకుపోయేలా చేస్తుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. దంతాలకు నష్టం: శీతల పానీయాలలో ఉండే ఆమ్లాలు పంటి ఎనామిల్‌ను బలహీనపరుస్తాయి. ఇది పంటి నొప్పి, సున్నితత్వం, కావిటీస్ ప్రమాదాన్ని పెంచుతుంది. అదనంగా, ఈ పానీయాలలో ఉండే రంగులు కూడా దంతాలపై మరకలు పడేలా చేస్తాయి. పోషకాహార లోపం: శీతల పానీయాలలో పోషకాహారం చాలా తక్కువగా ఉంటుంది. నీళ్లు, పంచదార, కృత్రిమ రుచులు తప్ప వాటిలో ప్రత్యేకత ఏమీ లేదు. వీటిని రోజూ తీసుకోవడం వల్ల శరీరంలో అవసరమైన విటమిన్లు, మినరల్స్ లోపించడం వల్ల బలహీనత, అలసట వంటి సమస్యలు వస్తాయి.

## ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉండాలంటే...



హాయిగా ఊపిరి పీల్చుకోవాలంటే ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉండాలి. ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉండాలంటే.. వాటికి వచ్చే అనారోగ్యాన్ని నివారించాలంటే.. కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాల్సిందే. ఈ నేపథ్యంలో ఊపిరితిత్తుల ఆరోగ్యం కోసం రోజువారీ జీవితంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఊపిరితిత్తులకు సంబంధించిన ప్రధాన ప్రమాద కారకాలలో జలుబు, న్యుమోనియా, క్షయ, ఆస్తమా, క్యాన్సర్, శ్వాసలోపం, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు వంటి పలు సమస్యలు ఉన్నాయి. వీటి నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవాలంటే ఈ కింది ఆహారాలు తప్పనిసరిగా తీసుకోవాలంటున్నారు ఆరోగ్య నిపుణులు. గ్రీన్ టీలో ఉండే క్యాటెచిన్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఊపిరితిత్తుల పనితీరు, ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అందుకే ప్రతి రోజూ గ్రీన్ టీ తాగాలంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఊపిరితిత్తుల పనితీరుకు తోడ్పడే విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే బ్లూబెర్రీస్, క్రాన్ బెర్రీస్ వంటి బెర్రీలను తీసుకోవడం కూడా మంచిదేనట. శరీర వాపును తగ్గించడానికి, ఊపిరితిత్తుల పనితీరును మెరుగుపరచడానికి సాల్మన్ చేపలు, వాల్‌నట్స్ వంటి ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవలి. అంతేకాకుండా, ఆహారంలో పసుపుతో సహా, దాని ఇమ్యునోస్టిమ్యులెంట్ లక్షణాలు శ్వాసకోశ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే అధిక యాంటీఆక్సిడెంట్ కంటెంట్ కోసం పాలకూర వంటి ఆకు కూరలను మీ ఆహారంలో అధికంగా చేర్చుకోవాలి. బ్రోకలీ, బ్రస్సెల్స్ వంటి కూరగాయలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల.. వీటిల్లోని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు మీ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. నారింజ, నిమ్మకాయలు వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని పెంచడంతోపాటు రోగనిరోధక శక్తిని ప్రోత్సహిస్తుంది.

## పొద్దున్నే పాలు కలిపిన టీ తాగుతున్నారా...?




చాలా మంది ఉదయాన్నే నిద్ర లేవగానే వేడి వేడి టీ తాగకుండా రోజు ప్రారంభించలేరు. ఒక్క కప్పు ఘుమఘుమలాడే టీ తాగితేగానీ నిద్ర మత్తు వదిలిపోదు. నిజానికి టీ మన దేశం అంతటా చాలా ప్రజాదరణ పొందిన పానీయం. దేశ వ్యాప్తంగా వివిధ రకాల టీలు అందుబాటులో ఉన్నాయి. గ్రీన్ టీ కంటే మిల్క్ టీని ఇష్టపడే వారు చాలా మందే ఉన్నారు. కానీ ఖాళీ కడుపుతో మిల్క్ టీ తాగడం అస్సలు ఆరోగ్యకరం కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు. పోషకాహార నిపుణులు చెబుతున్నదేమిటంటే.. టీ శరీరంపై ప్రతికూల ప్రభావాలను కూడా చూపుతుందని హెచ్చరిస్తున్నారు. ఖాళీ కడుపుతో మిల్క్ టీ తాగితే శరీరాన్ని డీహైడ్రేషన్ చేస్తుందట. ఇది గ్యాస్ హార్ట్ బర్న్ సమస్యను కూడా పెంచుతుందని చెబుతున్నారు. పాల టీని పదేపదే ఉడకబెట్టడం వల్ల పాలలోని పోషక విలువలు చాలా వరకు నాశనం అవుతాయి. కాబట్టి ఆరోగ్య పరంగా చూస్తే ఇలాంటి టీ తాగడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. ఖాళీ కడుపుతో మిల్క్ టీ తాగడం వల్ల పెప్టిక్ అల్సర్ వచ్చే ప్రమాదం చాలా ఎక్కువ. చాలా మంది చక్కెర లేకుండా టీ తాగలేరు. టీలో చక్కెర వేసుకుంటే హానికరమైన ద్రవాలు శరీరంలో పేరుకుపోతాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే షుగర్ పేషెంట్లు మిల్స్ టీ అస్సలు తాగకూడదు.

## యూరిక్ యాసిడ్ సమస్య తగ్గాలంటే...



శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరగడం వల్ల కొందరు విపరీతమైన అసౌకర్యానికి గురవుతుంటారు. యూరిక్ యాసిడ్ కంట్రోల్ చేయడానికి కొన్ని ఆహారాలకు దూరంగా ఉండాలి. అలాగే కొన్ని రకాల పండ్లు తీసుకోవడం వల్ల శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించడంలో సహాయపడతాయి. యూరిక్ యాసిడ్ సమస్య ఉంటే ఈ పండ్లను రెగ్యులర్ గా తీసుకోవాలంటున్నారు ఆరోగ్య నిపుణులు. అవేంటో తెలుసుకుందాం.. పుచ్చకాయలో సిట్రులిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో, మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడడంలో సహాయపడతాయి. పైనాపిల్‌లో వివిధ రకాల విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇందులో బ్రోమెలైన్ అనే ఉద్దీపనం ఉంటుంది. ఇది యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే శరీరంలో యూరిక్ యాసిడ్ స్ఫటికాలు ఏర్పడినప్పుడు గౌట్ నొప్పి మొదలవుతుంది. దీని నుంచి ఉపశమనం పొందాలంటే నారింజలు అధికంగా తినాలి. ఇవి యూరిక్ యాసిడ్ స్ఫటికాలుగా ఏర్పడకుండా నిరోధిస్తాయి. శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ యాపిల్స్ తినాలని వైద్యులు సూచిస్తున్నారు. యూరిక్ యాసిడ్ నివారణకు కూడా ఇది చాలా మంచిది.

## పండ్లను కోసేటప్పుడు



పండ్లలో శరీరానికి మేలు చేసే పోషకాలు ఉంటాయి. కొందరూ ఎక్కువగా పండ్లు, జ్యూస్‌లు తాగుతారు. అయితే తరచుగా అనుసరించడం మరచిపోయే పండ్లను సరైన మార్గంలో తినడం చాలామందికి తెలియదు. పండ్లకు తీపి, పుల్లని రుచిని ఇవ్వడానికి వాటిపై ఉప్పు చల్లడం చూసి ఉంటారు. ఇలా చేయడం వల్ల దాని రుచి మరింత పెరుగుతుందని వారు భావిస్తున్నారు. కానీ ఉప్పు కలిపిన వెంటనే.. పండు నుంచి నీరు వస్తుంది. పండు పోషకాలు కూడా ఈ నీటిలో నుంచి బయటకు వస్తాయి. అప్పుడు అటువంటి పండ్లను తినడం వల్ల ఏమి ప్రయోజనం పొందలేరని తెలుసుకోవాలి. పండ్లు తినడానికి ఇష్టపడతారు ఎందుకంటే పండ్లు తినడం వల్ల కడుపు చల్లగా ఉంటుంది. అయితే ఏ విధంగా తింటే పోషకాలు అందుతాయో ఇప్పుడు కొన్ని విషయాలు తెలుసుకుందాం. పండ్లు తినడానికి సరైన సమయం భోజనానికి ముందు. పండ్లు తింటే పొరపాటున కూడా నీళ్లు తాగొద్దు. పాలతో పండ్లను ఎప్పుడూ తినకూడదు. పొద్దున్నే పండ్లు తినే అలవాటుంటే ముందుగా నీళ్లు తాగి తర్వాత పండ్లు తినాలి. పచ్చి ఉప్పును ఎప్పుడూ తినకూడదు. ఎందుకంటే ఉప్పులో సోడియం పరిమాణం ఎక్కువగా ఉన్నందున ఇది కాలేయం, మూత్రపిండాలకు ప్రమాదకరమని రుజువు చేస్తుంది. పండ్లలో ఉప్పు కలిపి తీసుకోవడం వల్ల శరీరంపై చాలా తీవ్రమైన ప్రభావం ఉంటుంది. దీని ప్రభావం వెంటనే కనిపించదు కానీ కొంత సమయం తర్వాత అది శరీరంపై చాలా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. పండు నుంచి నీరు వస్తుంది. పండు పోషకాలు కూడా ఈ నీటిలో నుంచి బయటకు వస్తాయి. అప్పుడు అటువంటి పండ్లను తినడం వల్ల ఏమి ప్రయోజనం పొందలేరని తెలుసుకోవాలి. పండ్లు తినడానికి ఇష్టపడతారు ఎందుకంటే పండ్లు తినడం వల్ల కడుపు చల్లగా ఉంటుంది.






# ఇవన్నీ గేమ్‌లో భాగమే



ప్రభాస్ హీరోగా నటించిన సలార్ సినిమాలో శృతిహాసన్ హీరోయిన్ గా చేసింది. పేరుకు ఆమె హీరోయిన్ అయినప్పటికీ సినిమాలో ఆమె పాత్ర నిడివి మాత్రం చాలా తక్కువ. దీనికి సంబంధించి ఆమెపై చాలా కామెంట్స్ వినిపించాయి. హీరోయిన్ రోల్‌గా చెప్పుకునే ఇలాంటి అతిథి పాత్రలు చేయాల్సిన అవసరం ఏముందని చాలామంది ప్రశ్నించారు. 'సలార్'లో తన పాత్ర నిడివిపై పూర్తి స్పష్టత ఇచ్చింది శృతిహాసన్. ఓ మంచి వంటకం తయారవ్వాలంటే అందులో అన్నీ సమపాళ్లలో ఉండాలని, 'సలార్'లో తన పాత్ర కూడా అంతేనని స్పష్టం చేసింది. పైగా సూపర్ హిట్ అవుతుందని మనసుకు అనిపించినప్పుడు ఎందుకు వదులుకోవాలని ప్రశ్నిస్తోంది. "ఓ సినిమాకు సంతకం చేసేటప్పుడు చాలా అంశాల్ని లెక్కలోకి తీసుకుంటాను. సలార్‌లో నా పాత్ర నిడివి తక్కువగా ఉన్నప్పటికీ... నాది మంచి పాత్ర. అందుకే సలార్ సినిమా చేశాను. నేను కొన్ని సినిమాల్లో ఫుల్ లెంగ్త్ పాత్రల్లో కనిపించాను. కానీ వాటిలో కొన్ని సినిమాలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. మరికొన్ని సినిమాల్లో చిన్న రోల్స్ చేసినప్పటికీ పెద్ద హిట్టయ్యాయి. ఇవన్నీ గేమ్‌లో భాగమని.. హిట్ సినిమాలో ఉండాలంటే కొన్ని త్యాగాలు చేయాల్సిందే"అని అంటోంది శృతిహాసన్.


# వెంకటేశ్ హీరోయిన్ ఫైనల్.. సెకండ్ హీరోయిన్ కోసం వేట..!



టాలీవుడ్‌లో కొన్ని కాంబినేషన్స్‌లో సినిమా వస్తుందంటే క్యూరియాసిటీ బాగా ఉంటుంది. పక్కా ఎంటర్‌టైన్ మెంట్ గ్యారంటీ అని ప్రేక్షకులు ముందే ఫిక్సయిపోతారు. అలాంటి క్రేజీ కాంబోనే వెంకటేశ్ అనిల్ రావిపూడి. ఈ ఇద్దరి కాంపౌండ్ నుంచి వచ్చిన ఎఫ్2, ఎఫ్ 3 సినిమాలు సూపర్ హిట్‌గా నిలిచాయి. ఈ ఇద్దరూ మరోసారి నవ్వులు పంచేందుకు రెడీ అవుతున్నారు. ఎఫ్2, ఎఫ్ 3 తెరకెక్కించిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటంతో అంచనాలు భారీగా నెలకొన్నాయి. కాగా ఈ చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో ఎవరు కనిపించబోతున్నారనే దానిపై పలు వార్తలు నెట్టింట హల్ చల్ చేస్తుండగా.. తాజా అప్‌డేట్ ఒకటి దానిపై క్లారిటీ ఇచ్చేస్తుంది. ముందుగా వచ్చిన వార్తల ప్రకారం మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో ఫైనల్ అయినట్టు సమాచారం. దీనిపై మేకర్స్ నుంచి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ కూడా ఉండబోతుందట. అంతేకాదు కథానుగుణంగా రెండో హీరోయిన్ కూడా ఉండనుండగా.. ఇంతకీ ఎవరినీ తీసుకోబోతున్నారనన్నది సస్పెన్స్ నెలకొంది. ఈ చిత్రం ఆగస్టులో సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ మూవీకి సంబంధించి పూర్తి వివరాలపై రానున్న రోజుల్లో క్లారిటీ రానుంది. కామిక్ స్టైల్ ఉన్న అనిల్ రావిపూడి, వెంకీ కాంబినేషన్‌లో రాబోతున్న తాజా ప్రాజెక్ట్ హ్యాట్రిక్ హిట్‌గా నిలవడం ఖాయమని అప్పుడే అంచనాలు వేసుకుంటున్నారు సినీ జనాలు.

## 'కల్కి2898 ఏడి' మొదటి రోజు కలెక్షన్స్

# రూ. 191.50 కోట్లు




కల్కి 2898 ఏడి సినిమా మొదటి రోజే ప్రపంచవ్యాప్తంగా రూ. 191.50 కోట్లకు పైగా రాబట్టింది. ఈ విషయాన్ని ఆ చిత్ర బృందం 'ఎక్స్'(ఇదివరకటి ట్విట్టర్) వేదికలో పోస్ట్ చేశారు. నాగ్ అశ్విన్ దర్శకుడు తీసిన ఈ సినిమాలో ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపిక పదుకొణె వంటి ప్రముఖులు నటించారు. ఈ సినిమా తెలుగు, తమిళ్, హిందీ, కన్నడ, మలయాళం బాషలలో రిలీజ్ అయింది. ఈ సినిమా ఇండియాలోనే రూ. 95 కోట్లు సంపాదించి ఆల్ టైమ్ రికార్డు బ్రేక్ చేసింది. హిందీలో రూ. 27.5 కోట్లు ఆర్జించింది. వరల్డ్ వైడ్‌గా చూసినప్పుడు మొదటి రోజే రూ. 191.5 కోట్లు గడించింది. ఈ సినిమా చూసిన వారు చాలా వరకు బాగుందనే అంటున్నారు. కొందరు కథ అర్థం కాలేదన్నారు. ఎవరికి తోచింది వారు చెబుతున్నారు. కానీ మొత్తం మీద సినిమా చూడదగ్గదనే అంటున్నారు. ఎందుకంటే అనేక మంది బడా నటులుండడమేకాక, సినిమాటోగ్రఫీ వగైరాలు ఈ మూడు గంటల చిత్రాన్ని కూర్చోబెట్టి చూయిస్తున్నాయి. సినిమా మొదటి భాగం అంత బాగా లేకపోయినప్పటికీ, రెండవ భాగంలో ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలున్నాయంటున్నారు.

# ఈ కారు కొనడానికి ఇక మార్కెట్లో ఉండదు...?

కొన్ని అద్భుతమైన కార్లు ఇప్పటికే కనిపించకుండా పోయాయి. అలాంటి కార్లు మరోసారి వస్తాయంటే కారు ప్రియుల్లో పండుగ వాతావరణం నెలకొన్నట్లవుతుంది. గతంలో ఉన్న అంబాసిడర్ కారు.. తిరిగి కొత్త రూపంలో వస్తుందన్న ప్రచార సాగడంతో ఆ కారు ప్రియులు ఎంతో సంతోషించారు. ఆ తరువాత చాలా కార్లు కొన్నాళ్లపాటు అలరించి ఆ తరువాత కనిపించకుండా పోయాయి. అయితే లేటేస్టుగా మరో సూపర్ కారు కూడా కనిపించకుండా పోనుంది. దీనిని కొనుగోలు చేద్దామన్నా మార్కెట్లో కనిపించదు. ఇంతకీ ఏ కారు ఏదంటే? దేశంలో కార్ల ఉత్పత్తిలో తనకంటూ ప్రత్యేకత చాటుకుంటోంది హ్యుందాయ్ కంపెనీ. ఈ కంపెనీ నుంచి ఇప్పటికే చాలా ఆకర్షణీయమైన మోడళ్లు వచ్చాయి. ప్రస్తుతం దేశంలో పెట్రోల్, డీజిల్ కంటే ఎలక్ట్రిక్ కార్ల హవా పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో అందరికంటే ముందుగా హ్యుందాయ్ 'కోనా' అనే ఎలక్ట్రిక్ కారు మార్కెట్లోకి వచ్చింది. ఇది మార్కెట్లోకి వచ్చిన మొదటి ఎలక్ట్రిక్ కారు. 2019లో రిలీజ్ అయిన ఈ కారు ఆ తరువాత ఐదేళ్ల పాటు తన హవా సాగించింది. అయితే ఈ కారు ఇప్పుడు కనుమరుగు కానుంది. అయితే ఈ కారు ఉత్పత్తి నిలిపివేసినా దీని స్థానంలో క్రెటా ఈవీని మార్కెట్లోకి తీసుకురానున్నారు. ఇది 2025 లో మార్కెట్లోకి రానుంది. అయితే ప్రస్తుతం కోనా కారు కొనుగోలు చేయాలని ఉత్సాహం ఉన్నవారు ఆ కారు గురించి తెలుసుకోవాల్సింది. కోనా ఫీచర్స్ విషయానికొస్తే ఈ మోడల్ 29.2 కిలో వాట్ బ్యాటరీ ప్యాక్ ను కలిగి ఉంది. సింగిల్ ఛార్జింగ్ తో 452 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుంది. ఇందులో ఉన్న 100 కిలోవాట్ మోటారు 131 బీహెచ్ పీ పవర్ ను 395 ఎన్ ఎం టార్క్ ను ఉత్పత్తి చేస్తుంది.

కోనా కారు ధర మార్కెట్లో ప్రస్తుతం రూ.25.30 లక్షల తో విక్రయిస్తున్నారు. దీని స్థానంలో క్రెటా ఈవీ రానుంది. ప్రస్తుతం హ్యుందాయ్ క్రెటా కారు ప్రియులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఎస్ యూవీలో ది బెస్ట్ కారుగా ఉన్న క్రెటా ఇప్పుడు ఈవీగా రాబోతుంది. పెట్రోల్, డీజిల్ కార్ల నుంచి ఈవీకి మారాలనుకునేవారు క్రెటా ఈవీ మంచి ఆప్షన్ అని కారు ప్రతినిధులు పేర్కొంటున్నారు. అయితే ఆ కారు ఎలా ఉండబోతుందో తెలుసుకోవాలంటే 2025 వరకు ఆగాల్సిందే.




# పాలసీదారులు అప్రమత్తంగా ఉండాలి..
## హెచ్చరించిన ఎల్ఐసీ..





లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా కోట్లాది మంది పాలసీదారులను కలిగి ఉంది. అయితే దేశంలోని అతిపెద్ద బీమా సంస్థ అయిన ఎల్ఐసీ తన వినియోగదారులకు హెచ్చరిక జారీ చేసింది.తన పాలసీదారులకు వారి బీమా పాలసీలకు సంబంధించిన అనధికార లావాదేవీల గురించి అప్రమత్తం చేసింది. కొన్ని కంపెనీలు పాలసీని సరెండర్ చేసే పేరుతో ఎల్ఐసి పాలసీ హోల్డర్ల నుండి పాలసీని పొందాలనుకుంటున్నట్లు నివేదికలు వెలువడిన తర్వాత ఈ హెచ్చరిక జారీ చేసింది. ప్రజలు తమ ప్రస్తుత ఎల్ఐసి బీమా పాలసీని మంచి మొత్తం చెల్లిస్తామని హామీ ఇవ్వడం ద్వారా వారిని ఆకర్షిస్తున్న ఇలాంటి అనేక నివేదికలు వెలుగులోకి వచ్చాయి. అటువంటి పరిస్థితిలో ప్రజలు తమ బీమా పాలసీలను కంపెనీలకు సరెండర్ చేయడం లేదు. ఈ కంపెనీలను లేదా వాటి ఆఫర్లను ఎల్ఐసి ఆమోదించలేదని బీమా కంపెనీ తెలిపింది. అలాంటి ఆఫర్ల ఉచ్చులోకి అడుగు పెట్టకండి, లేకుంటే మీరు భారీ నష్టాలను ఎదుర్కోవలసి ఉంటుందని ఎల్ఐసీ తెలిపింది. మా కంపెనీ నియమ నిబంధనల ప్రకారమే పాలసీలను అందిస్తున్నట్లు తెలిపింది. అయితే కొందరు తమ బీమా పాలసీలను కంపెనీలకు అప్పగించకుండా ఈ విధంగా విక్రయిస్తున్నారు. ఇలాంటి ప్రలోభాలకు దూరంగా ఉండాలని, లేకుంటే నష్టపోతారని ఎల్ఐసీ నేరుగా ప్రజలను కోరింది. ఇలాంటి అనేక దేశవ్యాప్తంగా వెలుగులోకి వచ్చాయి. ఇందులో ప్రజలకు మంచి మొత్తం చెల్లిస్తామని హామీ ఇవ్వడం ద్వారా వారి ప్రస్తుత %వా×జ% బీమా పాలసీలను ఉపసంహరించుకోవలసి వస్తుందని తెలిపింది. ప్రజలు తమ బీమా పాలసీలను కంపెనీలకు సరెండర్ చేయకుండా, వాటిని ఈ విధంగా విక్రయిస్తున్నారు. ఇప్పుడు దీనిపై ఎల్ఐసీ స్పందించి పాలసీదారులను అప్రమత్తం చేసింది. ఇలాంటి ప్రలోభాలకు దూరంగా ఉండాలని ఎల్ఐసీ నేరుగా ప్రజలను కోరింది. పాలసీదారులు తమ బీమా పాలసీకి సంబంధించి ఏ నిర్ణయమైనా చాలా ఆలోచించి తీసుకోవాలని తెలిపింది. ఇది అతని కుటుంబానికి బీమా రక్షణ ప్రమాదాన్ని పెంచుతుంది. అదే సమయంలో వారి ఆర్థిక స్థిరత్వం కూడా ప్రభావితం కావచ్చు. ఎల్ఐసి తన పాలసీలలో ఏదైనా అమ్మకం లేదా బదిలీ బీమా చట్టం 1938 ప్రకారం జరుగుతుందని కూడా తన ప్రకటనలో పేర్కొంది. అందువల్ల, ఎవరైనా కస్టమర్లకు అలాంటి ప్రేరణలు కల్పిస్తే, దానికి ముందు వారు ఏదైనా ఎల్ఐసీ ఉద్యోగి లేదా ఏజెంట్ నుండి దాని గురించి ధృవీకరణ పొందాలని సూచించింది.

# వాహనదారులకు గుడ్ న్యూస్.....!



దేశవ్యాప్తంగా రోడ్లు సరిగా లేని ప్రాంతాల్లో టోల్ ఛార్జీలు వసూలు చేయొద్దని ఆయా ఏజెన్సీలకు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సూచించారు. గుంతలతో కూడిన రోడ్లు, టోల్ ప్లాజాల వద్ద రద్దీ ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. శాటిలైట్ ఆధారిత టోల్ వసూలుపై నిర్వహించిన గ్లోబల్ వర్క్‌షాప్‌లో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. 'మీ సేవలు ఉత్తమంగా లేనపుడు టోల్ ఛార్జీ వసూలు చేయొద్దు. రోడ్లు బాగా లేకపోతే ప్రజలు హర్షించరు. చాలామంది ఇప్పటికే సోషల్‌మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. కాబట్టి మంచి రోడ్లు నిర్మించలేపుడు టోల్ వసూలు చేయడం సరైనది కాదు. ఒకవేళ గుంతలతో కూడిన రోడ్లపై టోల్ వసూలు చేస్తే రాజకీయ నాయకులుగా మేం ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది. నేషనల్ హైవే ఫీల్డ్ ఆఫీసర్ల టోల్ ప్లాజాల వద్ద ఆలస్యం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి' అని ఆదేశించారు. ఇదిలా ఉంటే.. శాటిలైట్ ఆధారిత టోల్ ఛార్జీల వసూలు విధానాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రారంభించనున్నట్లు గడ్కరీ స్పష్టం చేశారు. తొలి దశలో 5 వేల కిలోమీటర్ల రహదారులపై ఈ టోల్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నామని, మొదట కమర్షియల్ వాహనాలకు ఒక లేన్‌లో అనుమతిస్తారని పేర్కొన్నారు. టోల్ వసూలుకు కీలకమైన వెహికల్ ట్రాకర్ సిస్టమ్ యూనిట్‌ను ఆయా వాహనాల్లో అమర్చాల్సి ఉంటుంది. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే వాహనాలు టోల్ ప్లాజాల వద్ద ఆగాల్సిన అవసరం లేదు. దశలవారీగా ఈ విధానాన్ని అమల్లోకి తీసుకొస్తాం. దీనివల్ల ప్రభుత్వానికి రూ.10వేల కోట్లు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు.

# యెస్ బ్యాంక్‌లో ఉద్యోగులపై వేటు....!



ప్రయివేటు రంగంలోని యెస్ బ్యాంక్ భారీ పునర్వ్యవస్థీకరణలో తమ ఉద్యోగులపై వేటు వేసింది.దాదాపు 500 మందికి ఉద్వాసన పలికింది. తాజాగా ప్రకటించిన తొలగింపులతో పాటు రానున్న వారాల్లో మరిన్ని ఉద్యోగులకు కోత పెడుతుందని సమాచారం. వ్యయ నియంత్రణ, సమర్థవంతమైన కార్యకలాపాల నిర్వహణ కోసం యెస్ బ్యాంక్ చర్యలు చేపట్టిందని ఆంగ్ల మీడియాలో రిపోర్టులు వచ్చాయి. ఒక పక్క అనేక బ్యాంకులు కొత్త శాఖలను ఏర్పాటు చేస్తూ వేగంగా విస్తరిస్తుంటే యెస్ బ్యాంక్ మాత్రం ఉద్యోగుల తొలగింపులకు వెళ్లటంపై ఇటు కంపెనీ ఇన్వెస్టర్లు, వినియోగదారుల్లో ఆందోళనలను రేకెత్తిస్తోంది. శాఖల బ్యాంకింగ్ విభాగంలోని అనేక విభాగాల్లో తొలగింపులు జరిగాయని తెలిసింది. కాగా.. ఒక మల్టీనేషనల్ కన్సల్టింగ్ సంస్థ సిఫార్సుల మేరకు ఈ తొలగింపులు చేపట్టింది. దీంతో హోల్‌సేల్, రిటైల్ బ్రాంచ్ బ్యాంకింగ్ సహా పలు విభాగాల్లోని ఉద్యోగులపై ప్రభావం పడింది. నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకోవడంతో పాటు, సిబ్బంది వినియోగాన్ని మెరుగుపరుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందని సమాచారం. తొలగింపునకు గురైన ఉద్యోగులకు మూడు నెలల జీతాన్ని బ్యాంక్ ఆఫర్ చేసిందని తెలుస్తోంది. యెస్ బ్యాంక్ ఎక్కువగా డిజిటల్ బ్యాంకింగ్ వైపు మొగ్గుచూపుతూ.. భౌతిక జోక్యాన్ని తగ్గించడం ద్వారా ఖర్చులను నియంత్రించుకోవాలని ప్రయత్నిస్తోందని ఆ వర్గాలు తెలిపాయి. ఆర్థిక సంవత్సరం 2023-24లో బ్యాంక్ సిబ్బంది ఖర్చులు 12 శాతం పెరగటం కూడా తాజా చర్యలకు దారి తీసిందని తెలుస్తోంది. అయితే ఇదే సమయంలో యెస్ బ్యాంక్ నికర లాభాలు ఏకంగా 74.66 శాతం పెరిగి రూ.1285.20 కోట్లకు చేరడం విశేషం. 2022-23లో రూ.735.82 కోట్ల లాభాలు నమోదు చేసింది. దీంతో పోల్చితే గతేడాదియ భారీగా లాభాలు పెరిగినప్పటికీ ఉద్యోగులకు ఉద్వాసన పలకడం గమనార్హం.

# న్యూక్లియర్ విద్యుత్ రంగంలోకి మేఘా ఇంజనీరింగ్

మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) న్యూక్లియర్ విద్యుత్ రంగంలోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. కర్ణాటక రాష్ట్రంలోని కైగా వద్ద 1400 మెగావాట్ ఎలక్ట్రికల్ (ఎండబ్ల్యుఇ) అణు విద్యుత్ కేంద్ర నిర్మాణానికి న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ అఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పిసిఐఎల్) నుంచి కాంట్రాక్టును దక్కించుకున్నట్లు బుధవారం ఆ సంస్థ వెల్లడించింది. ఎన్‌పిసిఐఎల్ పిలిచిన టెండర్లలో ఎంఇఐఎల్ అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొంది. ఇపిసి పద్ధతిలో దీన్ని నిర్మించనుంది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని అణు ఇంధనశాఖ పరిధిలోని ఎన్‌పిసిఐఎల్ ఇంజనీరింగ్, ప్రొక్యూర్మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఇపిసి) పద్ధతిలో ఈ రియాక్టర్ల నిర్మాణానికి గత ఏడాది మే నెలలో టెండర్లు పిలిచింది.అదే ఏడాది అక్టోబర్ నాలుగున టెండర్ల దాఖలుకు తుది గడువుగా నిర్ణయించారు. ఆ తరువాత రోజు అక్టోబర్ 5న సాంకేతిక బిడ్లను తెరిచారు. ఈ ఏడాది జూన్ 26న ప్రైస్ బిడ్లను తెరిచారు. ఈ బిడ్‌లో తక్కువ ధరను కోట్ చేసి ఎంఇఐఎల్ తొలి స్థానంలో నిలిచినట్లు సంస్థ డైరెక్టర్ సి హెచ్ సుబ్బయ్య తెలిపారు. ఈ టెండర్ ప్రక్రియలో ఎల్‌అండ్‌టి, బిహెచ్ఇఎల్ కూడా పాల్గన్నాయి. ఈ రెండు, సంస్థలు ఎక్కువ ధరను కోట్ చేసి రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఎంఇఐఎల్ రూ.12,799.92 కోట్ల ధరను కోట్ చేసి మొదటి స్థానంలో నిలిచింది. టెండర్ల విధానంలో ఎన్‌పిసిఐఎల్ క్వాలిటీ కం కాస్ట్ బేస్డ్ (క్యుసిబిఎస్) విధానాన్ని ప్రవేశ పెట్టింది.

# గోల్డ్ లవర్స్‌కి సూపర్ న్యూస్.......



గోల్డ్ ప్రియులకు నిజంగానే ఇది గుడ్ న్యూస్.. బంగారం ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి. గత ఐదు రోజులుగా గోల్డ్ రేట్స్ సుమారు రూ. 1,250 మేరకు తగ్గాయి.విదేశాల్లో బంగారం నిల్వలు తగ్గడంతో.. దాని ప్రభావం దేశంలోని పసిడి ధరలపై పడిందని నిపుణులు అంటున్నారు. గురువారం(జూన్ 27) 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ. 260 మేరకు తగ్గి రూ. 65, 990గా ఉంది. అలాగే 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ. 240 తగ్గి రూ. 71, 990 దగ్గర కొనసాగుతోంది. దేశంలోని వివిధ ప్రధాన నగరాల్లోనూ బంగారం ధరల్లోనూ స్వల్పం తేడాలు కనిపిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ. 66,140గా ఉండగా.. 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 72,650 దగ్గర కొనసాగుతోంది. అలాగే ఆర్థిక రాజధాని ముంబైలో 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 65,990గా.. 24 క్యారెట్ల బంగారం ధర రూ. 71,990గా ఉంది. ఇక తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే.. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 65,990 వద్ద కొనసాగుతుండగా.. 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 71,990గా ఉంది. వెండి కూడా బంగారాన్ని అనుసరిస్తోంది.

# కేంద్ర మంత్రి కుమార స్వామితో మంత్రి దుద్దిళ్ల భేటి...

## - ఆ భూములు రాష్ట్రానికి ఇవ్వాలని అభ్యర్థన



హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ (పిఎస్ యూ) లకు రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో కేటాయించిన భూములను వెనక్కు తిరిగి ఇవ్వాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్ డి కుమారస్వామిని కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న శ్రీధర్ బాబు కేంద్ర మంత్రితో నేడు సమావేశమై పలు అంశాలను చర్చించారు. ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రం పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమం కింద విక్రయించాలని నిర్ణయించినందున వాటి మిగులు భూములను తిరిగి అప్పగించాలని కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 70 సంవత్సరాల్లో అనేక ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేయగా వాటికి అప్పట్లో వేలాది ఎకరాల భూములను కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఖాయిలా పడిన ఆదిలాబాద్ సిసిఐ సిమెంటు పరిశ్రమను పునరుద్ధరించి స్థానికంగా ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలని కోరారు. 4 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ఈ సిమెంటు పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం 2100 ఎకరాల సున్నపు రాతి గనులతో పాటు మొత్తం 2290 ఎకరాల భూమిని ఉచితంగా అందజేసిందని గుర్తు చేసారు. దీనిని ప్రయివేటు పరం చేసే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. తెలంగాణాలో పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత అనుకూల పరిస్థితులు ఉన్నందున కొత్తగా ఏర్పాటు చేయబోయే ఇండస్ట్రీస్ ను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో రాష్ట్రం ముందుంది. ఇక్కడ భూములు, నీరు, విద్యుత్తు అవసరాల మేరకు అందుబాటులో ఉన్నందున పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో శిక్షణ పొందిన మానవ వనరులకు కొదవ లేదని, ఐటిఐ, డిప్లొమా, ఇంజనీరింగ్ స్థాయిల్లో స్కిల్డ్ మ్యాన్ పవర్ సమృద్ధిగా ఉందని వెల్లడించారు. రాష్ట్రాన్ని సందర్శించి ఇక్కడి అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలన్న శ్రీధర్ బాబు అభ్యర్థనకు కుమారస్వామి సానుకూలంగా స్పందించారు. త్వరలో హైదరాబాద్ కు వచ్చి తన దృష్టికి తెచ్చిన అన్ని విషయాలపై అధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు.

## పివి జయంతి... నివాళులర్పించిన ప్రముఖులు



హైదరాబాద్: పివి ఘాట్ వద్ద భారత రత్న, దివంగత మాజీ ప్రధాని పివి నరసింహారావు 103వ జయంతి వేడుకలు జరిగాయి. పివి ఘాట్ వద్ద పివి కుమార్తె వాణిదేవి, కుమారుడు ప్రభాకర్ రావు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, కోదండరామ్, హైకోర్టు జడ్జి శ్రావణ్ కుమార్, తదితరలు నివాళు లర్పించారు. అసెంబ్లీలో పివి నరసింహరావు చిత్రపటానికి సభాపతి గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డిలు పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ భవన్‌లో పివి నరసింహరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎంఎల్సీ వాణీదేవి, ఎంఎల్ఎ జగదీశ్ రెడ్డి, మహమూద్ అలీలు పూలమాల వేసి నివాళులర్పించారు. భారత రత్న దివంగత మాజీ ప్రధాని పి.వి 103 జయంతి సందర్భంగా గాంధీ భవన్ లో పి వి చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపి వి. హనుమంతరావు, డిసిసి అధ్యక్షులు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంగిశెట్టి జగదీష్, అల్లం భాస్కర్, భవాని రెడ్డి, రాపోలు జయ ప్రకాష్, ప్రేమలత అగర్వాల్, లింగం యాదవ్ తదితరులు నివాళులర్పించారు.

## భూ కుంభకోణం కేసులో హేమంత్ సోరేన్ కు బెయిలు



రాంచీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ కు జార్ఖండ్ హైకోర్టు భూ కుంభకోణం కేసులో బెయిలు మంజూరు చేసింది. ఇదిలావుండగా ఆయన తరపు లాయర్ అరుణభ్ చౌదరి కోర్టు ఆయన ఎలాంటి అపరాధం చేయలేదని భావించిందన్నారు. సోరేన్ పెట్టుకున్న బెయిల్ పై హైకోర్టు జూన్ 13 నిర్ణయాన్ని నిలిపి ఉంచింది. ప్రస్తుతం హేమంత్ సోరేన్ రాంచీలోని బిర్సాముండా జైలులో ఉన్నారు. ఆయన జార్ఖండ్ ముక్తి మోర్చా(జెఎంఎం) కార్యనిర్వాహక అధ్యక్షుడు. సోరేన్ ను ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్(ఈడి) జనవరి 31న అరెస్టు చేసింది. ఇదిలావుండగా ఈడి తరపు న్యాయవాది ఎస్. వి. రాజు మాత్రం హేమంత్ సోరేన్ భూ అక్రమాలకు పాల్ప డ్డారని సాక్షులు ధ్రువీకరించారని అన్నారు.

## లోక్ సభకు హాజరయ్యేందుకు పడవ కోరిన శశి థరూర్ ?!






న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో తన ఇల్లు వాన నీళ్లలో మునిగిపోయిన వీడియోను పార్లమెంటు సభ్యుడు శశి థరూర్ షేర్ చేశారు. రానున్న వారం రోజుల్లో ఈదురు గాలులతో కూడిన వానలు పడనున్నాయని మరో వైపు భారత వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. శశిథరూర్ లుటియన్స్ ఇల్లు వాణ నీళ్లలో మోకాలు లోతు వరకు కూరుకుపోయి ఉంది. వాన నీళ్లు ఆయన్ని పార్లమెంటు సమావేశాలకు హాజరు కాకుండా అడ్డుకున్నాయి. ఢిల్లీలో శుక్రవారం కురిసిన వానలు ఇప్పటికీ లోతట్టు ప్రాంతాలను నీళ్లలో ఉండేలా ముంచి ఉంచాయి. అనేక చోట్ల ట్రాఫిక్ జామ్ ఉంది. ఉరుములతో కూడిన భారీ వర్షం ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్ లోని అనేక ప్రాంతాలను అతలాకుతలం చేశాయి. తన ఇంటి ముందు నీళ్లు నిలిచిపోయి ఉన్న వీడియోను శశి థరూర్ ఎక్స్ వేదికలో షేర్ చేశారు. " ఇంట్లో ఉన్న కార్పెట్లు, ఫర్నీచర్, నేల మీద ఉన్న వస్తువులన్నీ పాడైపోయాయి. నీరు పోయేందుకు దారి లేకపోవడంతో నిల్వ ఉ ండిపోయాయి" అని ఆయన తన పోస్ట్ లో పేర్కొన్నారు.

# పార్టీని వీడి దొంగలల్ల కలిసెటోళ్ల గురించి బాధలేదు : కెసిఆర్

హైదరాబాద్: సమైక్యవాదులతో కలబడి నిలబడి అత్యంత కష్టతరమైన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఒక లెక్కనే కాదని, పార్టీ నుంచి పోయి దొంగల్లా కలుస్తున్న నాయకుల గురించి ఏమాత్రం ఆలోచించవలసిన అవసరం లేదని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ స్పష్టం చేశారు. ఒకరు పోతే పదిమంది నాయకులను పార్టీ తీర్చిదిద్దుకుంటుందని పునరుద్ఘాటించారు. తెలంగాణ ప్రగతి ప్రస్థానంలో చేరుకోవాల్సిన మైలురాళ్లు ఇంకా చాలా మిగిలి ఉన్నాయని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను,కలలను నెరవేర్చగలిగే అవగాహన తమకు మాత్రమే ఉన్నదని పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మను అర్థం చేసుకుంటూ సమస్యల లోతును పట్టుకోగలిగి పరిష్కరించగలిగే సత్తా ఉద్యమాన్ని నడిపించి రాష్ట్రాన్ని సాధించిన బిఆర్ఎస్‌కు మాత్రమే ఉన్నదని కెసిఆర్ వివరించారు. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌తో పార్టీ కార్యకర్తల సమావేశం శుక్రవారం కూడా కొనసాగింది. కోరుట్ల జగిత్యాల నియోజక వర్గాల నుంచి వందలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు నేతలతో కెసిఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కెసిఆర్ మాట్లాడుతూ..మనం రెట్టించిన ఉత్సాహంతో భవిష్యత్తులో ఇంకా బాగా ప్రజలకోసం పనిచేయాల్సి వుందని వ్యాఖ్యానించారు. ప్రజలు అవకాశమిస్తే..గత పదేండ్లు చిత్తశుద్ధితో రాజీపడకుండా ఉద్యమ ఆకాంక్షల సాధనదిశగా లక్ష్యం ప్రకారం పనిచేసి ప్రగతిని సాధించి ప్రజల మన్ననలను పొందామని తెలిపారు.



## షాద్‌నగర్ కంపెనీలో భారీ పేలుడు.. ముగ్గురు మృతి

షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో శుక్రవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, 15 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. సౌత్ గ్లాస్ ప్రైవేట్ కంపెనీ ఫర్నేస్ విభాగంలో కంప్రెసర్ గ్లాస్ పేలడంతో మంటలు చెలరేగాయి. మంటలు చెలరేగడంతో కార్మికులు, సిబ్బంది భయంతో బయటకు పరుగులు తీశారు. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ప్రమాదంలో గాయపడిన వారిలో పలువురి తలలు, కాళ్లపై గాయాలు గాయాలవ్వగా... చికిత్స పొందుతున్న వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. బాధిత కార్మికులంతా ఇతర రాష్ట్రాలకు చెందినవారని పోలీసులు పేర్కొన్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉనట్లు తెలిసింది. ఈ ఘటనపై షాద్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ప్రజలతో కేసీఆర్ ఆత్మీయ సమావేశాలకు బ్రేక్..
## అధినేతకు 3 రోజులు విశ్రాంతి ఇవ్వాలని బీఆర్ఎస్ నిర్ణయం



హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో గత 15 రోజులుగా కొనసాగుతున్న ఆత్మీయ సమ్మేళనాలకు మూడు రోజుల పాటు విరామం ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు కేసీఆర్‌తో పార్టీ ముఖ్యనేతలు చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆత్మీయ సమావేశాల పునఃప్రారంభ వివరాలను, ఏ నియోజకవర్గాల వారు ఎప్పుడు రావాలనే విషయాలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికల అనంతరం ఇప్పటికే పలు దఫాలుగా పార్టీ కార్యకర్తలు, నేతలతో కేసీఆర్ సమావేశమవుతున్నారు. ఈ క్రమంలోనే గత రెండు వారాలుగానియోజకవర్గాల వారీగా కార్యకర్తలు, నేతలను భేటీ అవుతున్నారు. తనను చూసేందుకు ఎర్రవెల్లి నివాసానికి వస్తున్న ప్రజలతో ఓపికగా కలుస్తున్నారు. గంటల పాటు నిలబడి వారిని కేసీఆర్ ఆప్యాయంగా పలకరిస్తూ.. వారితో ఫొటోలు దిగుతున్నారు. గత 15 రోజుల్లో దాదాపు 50 వేలకు పైగా ప్రజలు తమ అభిమాన నేతను కలిసి తమ ఆనందాన్ని, కష్టసుఖాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్‌తో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. పార్టీని వీడి దొంగలతో కలిసెటోళ్ల గురించి బాధలేదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. తెలంగాణ సాధించిన మనకు గిదో లెక్కనా? అని వ్యాఖ్యానించారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన నివాసంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలతో కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. పార్టీయే నాయకులను తయారు చేస్తుంది తప్ప.. నాయకులు పార్టీని ప్రభావితం చేయలేరని స్పష్టం చేశారు. నాడైనా నేడైనా నాయకులను తయారు చేసుకున్నది పార్టీనే అని తెలిపారు. వెరికల్లాంటి యువ నాయకులను పార్టీ సృష్టిస్తదని చెప్పారు. రెట్టించిన ఉత్సాహంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్ రెడ్డి, జాజాల సురేందర్, గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, ఎల్ రమణ తదితరులు పాల్గొన్నారు.

## విదేశాంగ శాఖ కొత్త కార్యదర్శిగా విక్రమ్ మిస్రీ



న్యూఢిల్లీ: ఉప జాతీయ భద్రత సలహాదారు (ఎన్ఎస్ఎ) విక్రమ్ మిస్రీని విదేశాంగ శాఖ కొత్త కార్యదర్శిగా నియమించినట్లు శుక్రవారం ప్రభుత్వ నోటిఫికేషన్ వెల్లడించింది. 1989 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారి విక్రమ్ మిస్రీ విదేశాంగ కొత్త కార్యదర్శిగా జూలై 15 నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు. వినయ్ క్వాత్రా స్థానంలో మిస్రీ నియామకం జరిగింది. 'వినయ్ క్వాత్రా స్థానంలో విదేశాంగ శాఖ కార్యదర్శి పదవిలో జాతీయ భద్రత కౌన్సిల్ సెక్రటేరియట్‌లో ఉప జాతీయ భద్రత సలహాదారు 1989 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారి విక్రమ్ మిస్రీ నియామకాన్ని క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదించింది' అని కేంద్ర సిబ్బంది మంత్రిత్వశాఖ జారీ చేసిన ఉత్తర్వు తెలియజేసింది. ఉప ఎన్ఎస్ఎగా మిస్రీ పదవీ కాలం కుదింపును కూడా కమిటీ ఆమోదించినట్లు ఆ ఉత్తర్వు తెలిపింది. విదేశాంగ శాఖ ప్రస్తుత కార్యదర్శి వినయ్ మోహన్ క్వాత్రా పదవీ కాలాన్ని ఆరు నెలల పాటు గత మార్చి నెలలో పొడిగించడం గమనార్హం. అయితే, ఆ ఉత్తర్వును ఇప్పుడు సవరించారు. క్వాత్రా పదవీ కాలం జూలై 14న ముగుస్తుంది. దౌత్య వ్యవహారాల్లో మిస్రీకి అపార అనుభవం ఉంది. ఆయన ముగ్గురు ప్రధానులు ఐకె గుజ్రాల్, మన్మోహన్ సింగ్, నరేంద్ర మోడీ వద్ద వ్యక్తిగత కార్యదర్శిగా పని చేశారు. చైనాపై విదేశాంగ మంత్రిత్వశాఖలోని అత్యంత నిపుణుల్లో ఒకరైన మిస్రీ ఈ మధ్య కాలం వరకు బీజింగ్‌లో రాయబారిగా వ్యవహరించారు. మిస్రీని 2022 జనవరిలో జాతీయ భద్రత కౌన్సిల్ సెక్రటేరియట్‌లో నియమించారు. భారత, చైనా సైనిక దళాల మధ్య 2020లో తూర్పు లడఖ్‌లోను, ఆ తరువాత గాల్వన్ లోయలోను సంఘర్షణల నేపథ్యంలో చైనాలో షీ జిన్‌పింగ్ ప్రభుత్వంతోసంప్రదింపులు సాగించడంలో కూడా మిస్రీ ప్రధాన పాత్ర పోషించారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com